ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 2 ఏప్రిల్ 2025

'డైట్'లో అధ్యాపక పోస్టుల భర్తీ

నెల్లూరు (విద్య) : జిల్లాలోని పల్లిపాడు డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎ.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు ఈనెల 10వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 11 నుంచి 13వతేదీ వరకు దరఖఖాస్తులను పరిశీలించి అర్హులకు 16, 17వ తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 19న ఇంటర్వ్యూలు, 21న డిప్యుటేషన్ నియామక ఉత్తర్వులు అందచేస్తామన్నారు. 22వతేదీన ఆయా సిబ్బంది విధుల్లో చేరా లని, ఏదైనా సందేహాలు ఉంటే విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రక్తం పీల్చి..
పైసలు గుంజి!

ప్రైవేటు ల్యాబొరేటరీలలో ఇష్టానుసారం వసూలు ● నిర్వాహకులు, వైద్యుల మిలాఖత్

కార్పొరేట్ ఆసుపత్రులలో మరింత దోపిడీ ● జిల్లాలో ప్రతినెలా రూ.8.5 కోట్ల వ్యాపారం



జ్వరం వస్తే రక్తపరీక్షలు.. కడుపునొప్పి వస్తే మలం పరీక్షలు.. దగ్గు వస్తోందంటే ఉమ్మి పరీక్ష, ఎక్సరే.... ఆయాసం అంటే ఈసీజీ స్కానింగ్.. తలనొప్పిగా ఉందంటే సిటీ స్కాన్.. పొట్ట ఉబ్బరంగా ఉందంటే ఎండోస్కోపీ.... ఇలా పరీక్షలు లేనిదే వైద్యులు రోగ నిర్ధారణ చేసే పరిస్థితి లేదు. రోగి నాడీ చూసి రోగం ఏమిటో ఇట్టే చెప్పే వైద్యులు ఉన్నా ల్యాబ్‌లో పరీక్షలు, రిపోర్టులను పరిశీలించనిదే చికిత్సను అందించడంలేదు. వైద్యులకు అందించే ఫీజుల కన్నా భారీ మొత్తంలో ఈ ల్యాబ్ పరీక్షలకు ఖర్చు అవుతోంది. ఇందులోనూ వైద్యులు భారీ మొత్తాలను ఆశిస్తుండటంతో ఆయా ల్యాబ్ నిర్వాహకులు కూడా వైద్యులతో ఒప్పందాలు కుదుర్చుకుని రోగుల రక్తాన్నే కాదు.. నగదునూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా 600లకుపైగా రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు ఉన్నాయి. ఇందులో 100 వరకు కార్పొరేట్ ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్నాయి. వీటిలో ఒక్కో ల్యాబ్‌లో వివిధ రకాల పరీక్షల పేరుతో రోజూ రూ.20వేల నుంచి 30 వేల వరకు వసూలు చేస్తుంటారు. 300 ల్యాబ్‌లలో ఒక్కో ల్యాబ్‌లో రోజుకు రూ.4-5 వేల వరకు పరీక్షల పేరిట వసూలవుతాయి. మరో 200 ల్యాబ్‌లలో రోజుకు 500 నుంచి వెయ్యి రూపాయలు రక్త పరీక్షలు పేరిట వసూలు చేస్తారు. ఈ లెక్కన ప్రతి నెల 8.50 కోట్ల రూపాయలకు పైగా రోగుల నుంచి వసూలు చేస్తున్నారు. ఒక్క నెల్లూరులోనే 300లకు పైగా రక్తపరీక్షా కేంద్రాలు ఉండగా, వీటిలో 80 శాతం ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్నవే. వివిధ పరీక్షల పేరుతో వైద్యులకు పర్సంటేజీల రూపంలో అందే మొత్తం భారీగానే ఉంటోంది. అవసరం లేకపోయినా హిమోగ్లోబిన్ పరీక్ష, కొలస్ట్రాల్, షుగర్, కిడ్నీకు సంబంధించి బ్లడ్ యూరియాతోపాటు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. చేసేది లేక రోగులు కూడా ఆ పరీక్షలు చేయించుకుంటున్నారు. మరోవైపు ల్యాబ్‌లలో టెక్నీషియన్ కోర్సులు పూర్తి చేసిన వారే రక్తపరీక్షలు చేయాలి. ఇందులో అనుభవం ఉన్న వారు పెద్దస్థాయి పరీక్షలు చేయాలి. అయితే ఎటువంటి కోర్సు చేయని వారు కూడా కొంత అనుభవంతో పరీక్షలు చేస్తున్నారు. ఈ పరీక్షల ఫలితాలలో అనేక పొరపాట్లు నమోదవుతున్నాయి. ఈ రిపోర్టుల ఫలితాలతో వైద్యులు చికిత్స చేస్తుండటంతో మరో వ్యాధికి గురి కావాల్సి వస్తోంది.

ల్యాబ్‌లలో వసూలు చేస్తున్నది.. (రూ.లలో)

నిర్ధారణ పరీక్ష	చేయాల్సినది	చేస్తున్నది
హిమోగ్లోబిన్	45-100	200-300
హెచ్ఐవీ	100-150	250-300
హెచ్‌బీఎస్	50-75	150-250
యూరియా	45-80	150-200
షుగర్	50-75	250-300
సిరం క్రియేటిన్	40-70	200-250
ఫాస్ఫేట్	75-100	300-470
యూరిన్	50-75	150-230
డెంగ్యూ	250-300	800-2600
ప్లేట్లెట్	150-200	500-700
మలేరియా	100-150	300-350

విడవలూరు మండలం పాపిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన రైతు సుబ్రహ్మణ్యానికి తరచూ జలుబు చేస్తుండటంతో నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యుడ్ని కలిశారు. లివర్‌కు సంబంధించి సిరప్ పరీక్ష చేయించుకోమని ఆ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌కు సిఫారసు చేశారు. పరీక్ష అనంతరం ఏ సమస్య లేదని తేలింది. అయితే, నిర్ధారణ పరీక్షకు మాత్రం రూ.3వేలు ఖర్చు అయ్యింది.

నెల్లూరులోని బాలాజీనగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేణు దగ్గు, జ్వరంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. రక్తంలో ప్లేట్లేట్‌ల కౌంట్, మలేరియా పరీక్షలు చేయించుకోవాలని సదరు వైద్యుడు రాయడంతో రూ.2వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. తీరా సాధారణ జ్వరంగా నిర్ధారణ అయింది. ఇలా అవసరం లేకపోయినా రక్త పరీక్షల పేరుతో కొందరు వైద్యులు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు.

● కొన్నింటికే అనుమతులు..

జిల్లావ్యాప్తంగా 600లకుపైగా కేంద్రాలు ఉండగా, కేవలం 100కుపైగా మాత్రమే అనుమతులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వెల్లడిస్తోంది. నెల్లూరుతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరులలో కొత్తగా ఈ కేంద్రాలు పుట్టుకొస్తున్నా వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు నగదు వసూలు చేస్తున్నారు. గుర్తు వచ్చినప్పుడు మాత్రమే వైద్య ఆరోగ్య శాఖాధికారులు దాడులు నిర్వహించి హెచ్చరికలతో వదిలేస్తుండటంతో పరిస్థితి యథావిధిగా మారుతోంది.

నిబంధనలు ఇలా..

రక్తపరీక్షా కేంద్రాలు ఏర్పాటుకు తప్పనిసరిగా వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు పొందాలి. ఆయా కేంద్రాలలో ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తారో రాతపూర్వకంగా తెలియజేయాలి. అలాగే ఏఏ పరీక్షలు నిర్వహిస్తున్నారో కూడా బోర్డులు ఏర్పాటు చేయాలి. ఏఏ పరీక్షలకు ఎంత నగదు వసూలు చేస్తారో తెలియజేయాలి. పారామెడికల్ శిక్షణ పూర్తి చేసుకున్న వారు మాత్రమే నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంది. ప్రతి ఐదేళ్లకోసారి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకోవాలి.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

రక్తపరీక్షా కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అలా చేసుకోని వారిపై తీవ్ర చర్యలు ఉంటాయి. ఎప్పటికప్పుడు మా అధికార బృందాలు కేంద్రాలపై దాడులు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నాయి. కేసులూ నమోదు చేస్తున్నాము. అనుమతులు ఉన్న వారే ఈ కేంద్రాలు నిర్వహించాలి. లేదంటే చర్యలు తప్పవు. పరీక్షల పేరుతో అధిక ధరలు వసూలు చేసే వాటిపై నిఘా పెడతాం.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



మనుబోలు : పరీక్షలు ముగియడంతో కేంద్రంలో నుంచి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థినులు

హమ్మయ్య..!

ముగిసిన టెన్త్ పరీక్షలు

ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలు మంగళవారం నాటితో పూర్తయ్యాయి. దీంతో విద్యార్థులంతా చివరి రోజున తమ పాఠశాలల్లో ఉపాధ్యాయు లకు, సహచర విద్యార్థులకు కన్నీటితో వీడ్కోలు పలికారు. మరికొంత మంది తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి ఐస్‌క్రీమ్ పార్లర్‌లకు వెళ్లి సేదతీరారు. ఈ ఏడాది జిల్లాలో 174 కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలు పరీక్షలను నిర్వహించారు. 1,968 మంది ఇన్విజి లేటర్లతోపాటు 174 మంది సీఎస్‌లు, 174 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 24 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు విధులు నిర్వహించారు. పరీక్షలన్నీ ప్రశాంతంగా పూర్తికావడంతో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

● 259 మంది గైర్హాజరు

మంగళవారం జరిగిన సోషల్ పరీక్షకు 259 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 29,310 మందికిగాను 29,051 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఈఓ బాలాజీరావు 5 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది 59 కేంద్రాలను పరిశీలించారు. ఈ ఏడాది ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

● 3 నుంచి మూల్యాంకనం

పదోతరగతి పరీక్షలకు సంబంధించి ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎ.బాలాజీరావు తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు అధికారులు చేపడుతున్నారని, సిబ్బంది నియామకాలను కూడా పూర్తి చేస్తున్నామన్నారు. ఈనెల 2వతేదీన సమావేశం నిర్వహించి సిబ్బందికి, ఉపాధ్యాయులకు విధులు కేటాయిస్తామన్నారు.

55 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లపై విచారణ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్1, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 55 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లపై విచారణకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సురేష్ ఉత్తర్వులు జారీ చేశారు. 2022లో ఏసీబీ బృందం కార్పొరేషన్‌లోని ఆరోగ్య విభాగంపై ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఇక్కడ అవినీతిపరమైన అంశాలను గుర్తించిన బృందం వాటి వివరాలను అప్పట్లో ప్రభుత్వానికి నివేదించింది. పలు డివిజన్లు, సెక్షన్లలో అవినీతి జరిగిందని గుర్తించిన ఏసీబీ వాటి ఆధారాలను అప్పట్లో ప్రభుత్వానికి సమర్పించింది. వాటిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరిని ఎవరు, ఎప్పుడు విచారిస్తారో తెలియాల్సి ఉంది.

నచ్చిన సమయంలో రిజిస్ట్రేషన్

● నేటి నుంచి కొత్త విధానం.. స్లాట్ బుకింగ్ అమలు

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. తొలి విడతగా జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఒకే సారి అన్ని కార్యాలయాల్లో అమలు చేస్తే సమస్యలు వస్తాయన్న ఆలోచనతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ విజయవంతం అయ్యాక అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేసేలా ప్రణాళికలను రూపొందించారు. స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి వచ్చాక స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండదు. నచ్చిన సమయంలో ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకుని సకాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

● రోజుకు 78 మాత్రమే..

నెల్లూరులోని ప్రధాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 78 స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఈ కార్యాలయంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ ఒక సబ్ రిజిస్ట్రార్ ఉంటే 39 స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు మాత్రమే చేస్తారు. గంటకు ఆరుకు తగ్గకుండా రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్దేశించారు. డాక్యుమెంట్ రాసుకునేటప్పుడు ఏ సమయం కావాలో అందులో నమోదు చేసుకుంటే సరిపోతుంది. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి అవగాహన లేకపోతే మీసేవా కేంద్రాల్లో ఉండే సిబ్బందిని లేదా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అడిగి తెలుసుకోవచ్చు. ఈ విధానంపై ఇప్పటికే ప్రజలకు, వ్యాపారులకు, దస్తావేజు లేఖరులకు, ఆన్‌లైన్ సంస్థల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమాలను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ నిర్వహించింది.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

రేషన్ షాపు వద్ద వివాదం

● ఇద్దరిని కత్తితో పొడిచిన వైసీపీ నేత ● కేసు నమోదు చేసిన కందుకూరు పోలీసులు

కందుకూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపు వద్ద ఏర్పడిన వివాదంలో వైసీపీ నాయకుడు ఇద్దరిని కత్తితో పొడిచిన సంఘటన మండలంలోని ఓగూరులో మంగళవారం రాత్రి జరిగింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. ఓగూరు ఎస్సీ కాలనీలో వైసీపీ నేతగా ఉన్న దగ్గుమాటి కోటయ్య రేషన్‌షాపు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి ఎస్సీ కాలనీలో రేషన్ పంపిణీ చేసే సమయంలో కోటయ్య బియ్యం గురించి ప్రశ్నించిన ఓ మహిళపట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులైన పల్లె రవీంద్ర, పల్లె రవికిరణ్‌లు జోక్యం చేసుకోవటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కోటయ్య తన వద్ద ఉన్న కత్తితో వారిని పొడిచాడు. ఈ ఘర్షణలో కోటయ్యతోపాటు మెడబలిమి వెంకటేష్ కూడా పాల్గొన్నట్లు బాధితులు తెలిపారు. తీవ్ర గాయాలైన రవీంద్ర, రవికిరణ్‌లను స్థానికులు కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం బాధితుల బంధువులు కందుకూరులోని ఉప్పుచెరువులో ఉన్న దగ్గుమాటి కోటయ్య ఇంటిపై దాడిచేసి, వస్తువులు ధ్వంసం చేసినట్లు సమాచారం. కందుకూరు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీంద్ర, రవికిరణ్

ఇంటర్ తరగతుల ప్రారంభం

● జిల్లాకు చేరిన ద్వితీయ సంవత్సరం పుస్తకాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 1వతేదీ (మంగళవారం) నుంచే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించింది. తొలివిడతగా ఏప్రిల్ 24వతేదీ వరకు తరగతులు నిర్వహించి 25 నుంచి తిరిగి జూన్ 1వతేదీ వరకు సెలవులు ఇవ్వనున్నారు. తిరిగి జూన్ 2న కళాశాలలు పునఃప్రారంభించి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం మార్చి 18న అకడమిక్ సంవత్సరాన్ని ముగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక సీనియర్ ఇంటర్‌కు సంబంధించి జిల్లాకు 1,19,724 నోట్‌పుస్తకాలు, 11,600 పాఠ్యపుస్తకాలు చేరగా వీటిని జిల్లాలోని అన్ని కళాశాలలకు మంగళవారం పంపిణీ చేశారు. అలాగే ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు 7వతేదీ నుంచి అడ్మిషన్లను ప్రారంభిస్తున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఈ ఏడాది నుంచే నీట్, జేఈఈ పరీక్షలకు సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేస్తూ కొత్త విధానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు విధివిధానాలను ఇప్పటికే ఆయా కళాశాలలకు పంపించగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యాక నూతన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి తరగతులు తరగతులు ప్రారంభిస్తామని ఆర్‌ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు.



ఇంటర్ కళాశాలలకు పాఠ్యపుస్తకాలను తరలిస్తున్న అధికారులు

వేసవిలో ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు!

● ఉష్ణోగ్రతలు, వడగాడ్పులపై అవగాహన కల్పించండి ● జిల్లా అధికార యంత్రాంగంతో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. వేసవి ఉష్ణోగ్రతలు, వడగాడ్పులపై ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇస్తూ గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రులు, 108 వాహనాల్లో ఐస్‌ప్యాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు లేకుండా మంచినీరు ఉంచాలని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయా ణికుల సౌకర్యార్థం చలివేంద్రాలు, బస్సుల్లో వాటర్ క్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేతిపంపులు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. ఎక్కడైనా పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కరెంటు కోతలు, షార్ట్‌సర్క్యూట్ లేకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మేతకు వెళ్తున్న పశువులకు నీటితొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డీఎంహెచ్‌వో సుజాత, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ జేడీలు సత్యవాణి, రమేష్‌నాయక్, ఆర్టీసీ ఆర్‌ఎం మురళీబాబు, విద్యుత్ శాఖ ఈఈ ఎం.శ్రీధర్ తదితరులు పాల్గన్నారు.



వడదెబ్బపై అవగాహనక కల్పిస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో ఐదు, మిగతా తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ జీ.మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని నెల్లూరు(అక్కచెరువు), గండిపాళెం, తుమ్మలపెంట, ఆత్మకూరు గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల ఆరులోగా దరఖాస్తు చేసుకోవాలని, 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8765
వెండి కిలో ధర	రూ. 1,03,200
వెండి ఒక గ్రాము	రూ.106.20

న్యూస్ బాక్స్

దంత సంరక్షణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సీతారామపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : దంత సంరక్షణపై ప్రజలు తప్పనిసరి అవగాహన కలిగి ఉండాలని దంత వైద్యురాలు అనీస్ సల్మా పేర్కొన్నారు.వరల్డ్ ఓరల్ హెల్త్ డే మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది,శేఖర్ రాజు, తిరుపాల్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు,తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టి నిర్మాణానికి భూమిపూజ



నీటి తొట్టి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏపీవో శ్రీనివాసులు

ఉదయగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లిలో మంగళవారం ఏపీవో శ్రీనివాసులు నీటితొట్టి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మూగజీవాలు, వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. మండలానికి 50 నీటి తొట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో బీఎఫ్‌టీ ప్రసన్న, ఎఫ్ఏ సురేష్‌రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ




చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో మంగళవారం సర్పంచి అరికొండ పెంచలమ్మ ఆధ్వర్యంలో చెత్తబుట్టల పంపిణీ చేపట్టారు. గతనెల 15న సచివాలయంలో వృధాగా పడి ఉన్న చెత్తబుట్టలకు సంబంధించి ఆంధ్రజ్యోతిలో 'నిరుపయోగంగా చెత్తబుట్టలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయమై ఉన్నతాధికారులు ఆరా తీసి నివేదికను సేకరించారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి బద్దిపూడి హరి గ్రామంలోని ఇంటింటికెళ్లి తడి, పొడి చెత్త సేకరణకు అవసరమైన బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మహేష్, టీడీపీ నాయకులు గడిపూడి మురళి, అరికొండ వెంకటరత్నం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసానికి డిమాండ్



వరిగడ్డిని తరలిస్తున్న ట్రాక్టర్

అనంతసాగరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. డెల్టాలో ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉత్తర కాలువ, చెరువులు, బోర్ల కింద సుమారు 20 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ప్రస్తుతం 80శాతం వరకు కోత పనులు ముగిశాయి. మెట్టప్రాంతాల నుంచి రైతులు ఎండు గడ్డి కోసం భారీగా తరలివస్తున్నారు. మర్రిపాడు, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడుతో పాటు కడప జిల్లాలోని వివిధ మండలాల నుంచి పాడి రైతులు పశుగ్రాసం కోసం వస్తున్నారు. గతంలో ట్రాక్టర్ గడ్డి రూ. 2వేల నుంచి రూ. 4వేలకు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం రూ. 8 వేలు ధర పలుకుతోంది. ఈక్రమంలో వరిసాగు చేసిన వారికి పశుగ్రాసంపై ఆదనపు ఆదాయం లభిస్తోంది.

పోలేరమ్మకు పొంగళ్లు

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి అమ్మవారి నైవేద్యాలను, పూజా సామగ్రిని గంపల్లో పెట్టుకుని అమ్మవారి దేవస్థానం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టారు.

గోకులం షెడ్లతో మూగజీవాలకు రక్షణ

పశుపోషకుల హర్షం

సీతారామపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లు మూగ జీవాలకు రక్షణ నిలయాలుగా మారాయని రైతులు, పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గోకులం షెడ్లు నిర్మిస్తోంది. జూదంగా మారిన వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా రైతులు పశుపోషణకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఈ పశువుల షెడ్లు రైతులకు లబ్ధి చేకూరుస్తున్నాయి. మండలం వ్యాప్తంగా ప్రభుత్వం 29 షెడ్లను మంజూరు చేసింది. మండలంలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో మండలంలోని లబ్ధిదారులు నిర్మాణాలు మొత్తం పూర్తిచేశారు. ఇప్పటికే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇటీవల కొన్ని పశువుల షెడ్లు ప్రారంభించారు. గతంలో పశువులకు సరైన వసతులు లేక ఇంటి సమీపంలోని చెట్ల కింద రక్షణ లేకుండా కట్టేవారమని, ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పశువులు ఉండేవని పశువుల యజమానులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేయడంతో వాటిని పూర్తిచేసుకున్నట్లు దేవిశెట్టిపల్లి, సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, పబ్బులేటిపల్లి, చిన్ననాగంపల్లి, సీతారామపురం తదితర గ్రామాల రైతులు, లబ్ధిదారులు పేర్కొన్నారు. ఈ గోకులం షెడ్లతో మూగజీవాలకు నీడ, రక్షణ ఉంటుందని తెలిపారు.



దేవిశెట్టిపల్లిలో పూర్తయిన గోకులం షెడ్డు

● షెడ్ల నిర్మాణాలు పూర్తయినా మంజూరుకాని నిధులు

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తయినా బిల్లులు పడలేదని లబ్ధిదారులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లులు మంజూరు చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఉపాధి హామీ పథకం ఏపీవో సుభాషిణిని వివరణ కోరగా.. అన్నింటికీ ఎంబుక్‌లు సిద్ధం చేసి బిల్లులు పెట్టినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే జమ అవుతాయన్నారు.

అపరిశుభ్రంగా వింజమూరు శివారు ప్రాంతాలు



వింజమూరులోని ప్రధాన రోడ్డుపైకి చేరుతున్న మురుగునీరు



డంపింగ్ యార్డులా రాజీవ్‌నగర్ ప్రాంతం

వింజమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ముఖ్యంగా రాజీవ్ నగర్‌లో చెత్తాచెదారంతో నిండి ఉంది. పట్టణంలోని మెయిన్ ప్రాంతాల్లోనే చెత్తను తొలగిస్తున్నారని, శివారు ప్రాంతాల్లో పట్టించుకోవడంలేదని ఆ ప్రాంతవాసులు తెలిపారు. ఇలా చెత్తను వదిలేయడంతో ఆ చెత్త మురుగు కాలువల్లో చేరుతుందన్నారు. దీంతో మురుగునీరు పోయే మార్గం లేక నిలిచిపోతుందని, ఫలితంగా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని వారన్నారు. అలాగే పట్టణంలోని వైశ్యాబజార్‌లో కాలువలు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. ఈ ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి గ్రామోత్సవం

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు దేవరబోడుపై వెలసి ఉన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను వాహనంపై ప్రతిష్ఠించి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం నందిపాడు, రెడ్లదిన్నె, పాపంపల్లి, బొటికర్లపాడు తదితర గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

మట్టి తవ్వేసి రోడ్డుపై వదివేశారు..!



మెయిన్ రోడ్డుపై నెల రోజులుగా ఉన్న మట్టి దిబ్బ

కలువాయి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని పొదలకూరు- సోమశిల మెయిన్ రోడ్డులో తాగునీటి పైపులు లీక్ అవుతుండటంతో పంచాయతీ సిబ్బంది మరమ్మత్తుల కోసం గుంట తవ్వి మట్టి రోడ్డుపై వేశారు. దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు రోడ్డుపై ఉన్న మట్టి తీసి గుంట పూడ్చలేదు. మట్టి దిబ్బ రోడ్డుపై ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి మెయిన్ రోడ్డు కావడంతో తరుచుగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. మెయిన్ రోడ్డులో పైపులు మరమ్మత్తుల కోసం తవ్వి మట్టి రోడ్డుపై వేసి ఇంత కాలం వదిలివేయడం ఎమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ దృష్టికి తీసుకుపోగా ఇంకా పని పూర్తికాలేదు. అయిన తరువాత రోడ్డుపై మట్టితీసి గుంట పూడ్చివేస్తామని తెలిపారు.

వలస బాటన మూగజీవాలు



సీతారామపురం, (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే మూగజీవాలకు గ్రామాల్లో పశుగ్రాసం కొరత కారణంగా వలసబాట పట్టాయి. మండలంలోని పశుపోషకులు వారి స్వగ్రామాలను వదిలి మహిమలూరు,డిసి పల్లి, సోమశిల చుట్టు పక్కల ప్రాంతాల మీదుగా గడ్డి, నీరు దొరికే ప్రాంతాలకు వలసబాట పట్టారు.వర్షాకాలం ప్రారంభమైన సమృద్ధిగా గడ్డి లభించే వరకు తమ జీవాలకు గడ్డి, నీరు దొరికే ప్రాంతాలకు తిప్పుకుంటూ బతికిం చుకుంటామని పశుపోషకులు వాపోయారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో మంగళవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పింఛన్లు పంపిణీ చేశారు. కాలనీలోని విద్యుత్ షాక్‌కు గురైన బాధితులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాలనీలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, సర్పంచి సృజన, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, టీడీపీ నేత జీ. రఘు, ఎంపీటీసీ భవానీ, బీజేపీ నాయకులు డేగా మధుసూదన్, రంగారావు, సుబ్బారెడ్డి, తిరుపతిఆచారి తదితరులు పాల్గొన్నారు.



జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● డయాలసిస్ సెంటర్ పరిశీలన

వింజమూరు సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 4 లేదా 5 తేదీల్లో ఈ సెంటర్‌ను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. జనరేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీడీవో డాక్టర్ కార్తీక్‌తో మాట్లాడుతూ మంత్రి వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను చక్కగా చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం పెంచాలి



ఆర్డీవోకి వినతిపత్రం అందచేస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం పెంచాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం వారు ఆర్డీవో పావనికి వినతిపత్రం అందచేశారు. అనంతరం రైతు సంఘం, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల, ఇనగలూరు, బెడుసుపల్లి, పాతదేవరాయపల్లి గ్రామ రైతులు 67 నెంబరు హైవేతో భూములు కోల్పోతున్నారని తెలిపారు.

వారికి 2013 భూసేకరణ చట్టప్రకారం నష్ట పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య, గంటా లక్ష్మీపతి, సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష మస్తాన్, పుల్లారెడ్డి, ప్రసాద్ రెడ్డి,బీ. వెంకటేశ్వరరెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వీటిని పట్టించుకోరా..?

ఉదయగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది ప్రాణాలు కాపాడిన, వైద్యసేవలందించిన 108, 104 వాహనాలు మరమ్మతులకు గురైతే పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రభుత్వం నూతన వాహనాలను కేటాయించడంతో పాత వాహనాలు మూలకు చేరాయి. ప్రస్తుతం అవి తుప్పుపట్టిపోయాయి. ఆ వాహనాలను ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వదిలేశారు. వాటిని చూసిన ప్రతిఒక్కరు ప్రభుత్వ ఆస్తులంటే మరీ ఇంత నిర్లక్ష్యమా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మరమ్మతులకు గురైన 108 వాహనం



ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా 104 వాహనం

C.R.I.M.E N.E.W.S

పీకేపాడు ఇసుక రీచ్ తనిఖీ : 3 లారీల పట్టివేత



వాహనాలను పట్టుకున్న మైనింగ్ అధికారులు

అనంతసాగరం ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంభంపాడు ఇసుక రీచ్‌ను మైనింగ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను వారు పట్టుకొని కేసులు నమోదు చేశారు. ఈదాడుల్లో ఆర్ఐ స్వాతి, టీఏ వాణిశ్రీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



సురేష్ మృతదేహం

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో సోమవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఉదయగిరి సురేష్(38) నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆలయానికి సమీపంలో ఉన్న టెంకాయల దుకాణానికి వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న సురేష్ ఇనుప పైపును పట్టుకొని ఉన్నాడు. వెల్డింగ్ చేసే సమయంలో ఆ పైపునకు విద్యుత్ సరఫరా రావడంతో షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు అతన్ని రక్షించేందుకు సీపీఆర్ చేశారు. అనంతరం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు నిర్థారించారు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మంగళవారం ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఈతకెళ్లి యువకుడి దుర్మరణం



మస్తాన్‌బాష మృతదేహం

అనంతసాగరం ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని మినగల్లు చెందిన షేక్ హుసేన్-దిల్‌షాద్ దంపతుల కుమారుడు మస్తాన్‌బాష (22) సోమవారం సాయంత్రం ఈత కోసం మిత్రులతో కలసి సమీపంలోని ఉత్తర కాలువకు వెళ్లాడు. కాలువలో ప్రవాహం అధికంగా ఉండటంలో నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, బంధువులు కాలువ వద్దకు చేరుకొని గాలించారు. అప్పటికే చీకటి పడడంతో ఆచూకీ తెలియరాలేదు. మంగళవారం ఉదయం పోలీసులు సహకారంతో మళ్లీ గాలింపు చేపట్టారు. నల్లరాజుపాలెం సమీపంలో మృతదేహం కనిపించగా వెలికితీశారు. చేతికందిన కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మాగుంటలేవుట్‌లో మంగళవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. రైలు ఢీకొనడంతో గాయపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ హరిచందన తెలిపారు. మృతదేహంపై ఎరుపు రంగు గీతల ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బ్రౌన్ కలర్ లుంగీ ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలో నగదు చోరీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని గోమతి నగర్‌కు చెందిన ప్రసాద్ రావుకు ఇటీవల వాట్సాప్‌లో 'పీఎం కిసాన్' పేరిట ఏపీకే ఫైల్ వచ్చింది. దాన్ని ఆయన తెరిచారు. ఆ తర్వాత గత నెల 29వ తేదీన ఆయన తన ఫోన్‌పే యాప్‌ను ఓపెన్ చేశారు. ఈ క్రమంలో అతని బ్యాంకు ఖాతా నుంచి మూడు దఫాలుగా రూ.2,59,970 నగదు డ్రా అయి నట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ప్రసాదరావు వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. మంగళవారం దర్గామిట్ట పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రోశయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారుల మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలు

● పది రోజులకే గుంతల మయం



పది రోజులకే తారులేక లేచిపోతున్న రోడ్డుపై చేసిన ప్యాచ్‌వర్కు

చేజర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రహదారుల మరమ్మతు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నాసిరకంగా చేపట్టడంతో పట్టుమని పదిరోజులకే అధ్వానంగా తయారవుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో రహదారులను పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలుత రోడ్లపై గుంతలు పూడ్చాలనే ఉద్దేశంతో పాత్‌ఫర్‌హోల్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఆదురుపల్లి, కొలపనాయుడుపల్లి నుంచి కలువాయి మండలంలోని దాచూరుకు వెళ్లే రహదారిలో ఇటీవలే గుంతలు పూడ్చివేత పనులు చేపట్టారు. అయితే కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో కంకర లేచిపోయింది. పట్టుమని పది రోజులు కూడా కాకముందే కంకర లేచిపోయి రోడ్డుపై గుంతలు పడడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదని, ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణాలు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	142
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	282

కోడిగుడ్ల ధర (100): 520

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280

కలిగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 371 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 265 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-82, ఆర్ ఆర్-3, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-13 కారణాలతో 106 బేళ్ల తిరస్కరణకు గుర య్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.254, సగటు ధర రూ.274.89గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బోగోలు యాదవపాలెంలో వెలసి ఉన్న గంగమ్మకు నెల తొలి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని గంగపెట్టెకు పూజలు నిర్వహించారు. చిన్నారులు ధన్విక, విశిష్టల భరతనాట్యం ఆకట్టుకుంది. ప్రతి ఆది వారం గంగమ్మకు పొంగళ్ల కార్యక్రమం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

● ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందచేసి అభినందిస్తున్న బుడగ జంగాలు

కావలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేరుస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ కూటమి ప్రభుత్వానికి రుణ పడి ఉంటామని బుడగజంగాల నేతలు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం సాయంత్రం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి నివాసం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు.

నా రాజకీయ ప్రవేశానికి నాన్నే ప్రేరణ

● ఎమ్మెల్సీ శ్రీకాంత్ ● ఘనంగా కంచర్ల రామయ్య జన్మదిన వేడుకలు



రామయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వివిధ రంగాల ప్రముఖులు, అధ్యాపకులు

కందుకూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నా రాజకీయ ప్రవేశానికి నాన్నే ప్రేరణ అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఆయన తండ్రి, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఎప్పుడూ సమాజానికి మంచి చేయాలనే ఆలోచనతో ముందుకు సాగేవారని, ఆయన చూపిన మార్గంలో నేను నడవాలని ఎల్లప్పుడూ ప్రోత్సహించేవారని తెలిపారు. అనంతరం రామయ్య బాల్య స్నేహితులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, గజమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజవాడ వెంకటరావు, డాక్టరు ఆదిలాభాను, కంచర్ల సుబ్బారావు, గట్టినేని అయ్యన్న, కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘస్తులు, పాస్టర్లు

బిట్రగుంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరగాలని క్రైస్తవ సంఘాల సభ్యులు, పాస్టర్లు కోరుతూ మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బోగోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ శ్యాంసన్‌బాబు ఆధ్వర్యంలో మండలంలోని అని క్రైస్తవ సంఘాల పాస్టర్లు, సభ్యులు విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట పెట్రోల్ బంక్ నుంచి బోగోలు బజారు కూడలి మీదుగా రైల్వే ఎల్సీగేట్ 144 వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ కమిటీ సభ్యులు సీహెచ్.నాగరాజు, చిల్లా రవి, జీ.రమేష్, పోలయ్య, డేవిడ్‌పాల్, సాల్మన్‌రాజు, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి



అంకభూపాలపురంలో దివ్యాంగుడికి పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అంకభూపాలపురంలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛను అందజేశారు. ఈ సందర్భగా ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరువేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదన్నారు. 1వ తేది సెలవు వస్తే ఒరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, తహసీల్దారు అబ్దుల్‌అమీద్, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు ప్రగడ శ్రీనివాసులు, చెంచు శ్రీనివాసులు, బక్కమంతుల మా ల్యాద్రి, ప్రగడ మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

మండలంలోని పోకూరులో గ్రామ సచివాలయాన్ని మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టరులను పరిశీలించారు. అధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన అగ్రికల్చరల్ అసిస్టెంట్ సుష్మకు మెమో జారీ చేయాలని ఎంపీడీవో నరేంద్రదేవ్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమయపాలన పాటించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకరావాలని చెప్పారు.

ప్రొఫెసర్ శైలజకు ఉగాది పురస్కారం

కావలిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యు కావలి పీజీ కళాశాల జీవశాస్త్ర సహ ఆచార్యులు వీశైలజకు ఉగాది పురస్కారం లభించింది. శైలజ జీవశాస్త్రంలో అనేక పుస్త



ఉగాది పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ శైలజ

కాలు, జర్నల్స్ రచించడం, అనేక జాతీయ స్థాయి పరిశోధనా పత్రాలు సమర్పించి అవార్డులు పొందడంతో జీవన యాగశాల ఆరోగ్య ట్రస్ట్‌వారు సోమవారం రాత్రి నెల్లూరు టౌన్ హాల్‌లో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో భాగంగా ఆమెను ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. ట్రస్ట్ ఛైర్మన్ ఎం.ప్రసన్నకుమార్, రామాయణం మహేష్‌స్వామి, లలితా భరద్వాజ దత్త పీఠాధి పతులు ఆమెను అభినందించారు. మంగళవారం కళాశాలలో డాక్టర్ శైలజను ప్రిన్సిపాల్ వీరారెడ్డి, ఆచార్యులు, సిబ్బంది అభినందించారు.

బ్యాంకులు సర్‌చార్జీలు రద్దు చేయాలి

● ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత సంఘర్షణ సమితి ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

కావలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకులు సర్‌చార్జీలు రద్దు చేసి చేసి దోపిడీని అరికట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పర్యాయాలకు మించి ఏటీఎంలలో లావాదేవీలు జరిపితే రూ.50లు కట్ చేస్తున్నారన్నారు. ఏడాదిపాటు లావాదేవీలు జరుగకపోయినా, బ్యాంక్ ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోయినా డబ్బులు కట్ చేస్తున్నారన్నారు. పేదవారి దగ్గర సర్‌చార్జీల పేరుతో వసూళ్లు చేసి పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇస్తుండటంతో వారు బ్యాంక్‌లకు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి నేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి లక్ష్మయ్య, నాగబోయిన భాస్కర్, ఎం.లక్ష్మీనర్సు, జెడ్డా వాసు, ఆలూరు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

తడి,పొడి చెత్తను క్లాప్‌మిత్రలకు ఇవ్వండి

లింగసముద్రం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్లలోని తడి పొడి చెత్తను వేర్వేరుగా క్లాప్‌మిత్రలకు ఇవ్వాలని ఎంపీడీవో కె శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం మండలంలోని చినపవనిలో ఆయన ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త సంపద సృష్టి కేంద్రాన్ని, గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వచ్చి 11 గంటలకు వరకు చేయాలన్నారు. అలాగే పని ప్రదేశంలోనే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ రషీద్‌బాషా, పంచాయతీ కోఆర్డినేటర్ రాజేష్ కూడా ఉన్నారు.

రేపటి నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

కావలి రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 3వ తేదీ నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలీసెట్‌కు హాజరయ్యే విద్యార్థుల కోసం కావలి పట్టణంలోని విశ్వోదయ బాలికల పాఠశాలలో, రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ క్లాసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత మెటీరియల్ ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 9949022772, 9966797981లను సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన పార్థసారధి

బిట్రగుంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కావలి అంబేడ్కర్ నగర్‌కు చెందిన పచ్చా పార్థసారధి(39) గత నెల 25వ తేదీన రాత్రి మోటారుసైకిల్‌పై బోగోలుకు వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో అంబేడ్కర్ కాలనీ సమీపంలో స్పీడ్ బ్రేక్ వద్ద అదుపు తప్పి పడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కావలికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కోటేశ్వరావు తెలిపారు.

'పశు బీమా' తగ్గింది

- ప్రీమియం చెల్లింపుల్లో మార్పులు
- రైతు వాటా 5 శాతం తగ్గించిన ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంతోపాటు పాడిపరిశ్రమకు ఎంతో ప్రాధాన్యతనిస్తోంది.. ఇప్పటికే ఎన్నో పథకాలను అందుబాటులోకి తీసుకు రాగా తాజాగా పశుబీమా పథకంలో కొన్ని మార్పులు చేసింది. ప్రీమియం చెల్లింపుల్లో రైతు వాటాను మరో 5శాతం తగ్గిస్తూ ఉత్తర్వులిచ్చింది. కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమకు ఇస్తున్న ప్రాధాన్యంతో గతి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాడికి దూరమైన రైతులు తిరిగి పాడి రంగంపై దృష్టి సారిస్తున్నారు.



నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమలో జాతిని బట్టి పశువుల విలువ ఉంటుంది. అయితే వివిధ కారణాలతో పశువులు మరణిస్తే వాటి పోషకులు నష్టపోతారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేసింది. దీన్ని పొందేందుకు రైతు వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లిస్తే మిగిలిన 80 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయి. ఈ పథకంలో నమోదైన రైతులకు సంబంధించిన పశువులు చనిపోతే సదరు రైతుకు బీమా నగదు రూపంలో ఆర్థికంగా కొంత ఉపశమనం లభిస్తుంది. తాజాగా రైతు వాటా కింద చెల్లించే 20 శాతంలో మరో 5శాతం తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● వైసీపీ పాలనలో కాలయాపన

వైసీపీ ప్రభుత్వంలో పశువులు చనిపోతే వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం ద్వారా పాడి రైతులకు పరిహారం అందిస్తామని పెద్దఎత్తున ప్రకటనలు గుప్పించారు. మొదటి ఏడాది మాత్రం పరిహారం అందించినా ఆ తరువాత నాలుగేళ్లు ఎలాంటి పరిహారం చెల్లించలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మరుగున పడిపోయిన పాత బకాయిలను సైతం చెల్లించడమేకాక పశుబీమా పథకాన్ని పునః ప్రారంభించింది.

● 5శాతం తగ్గింపు

పశుబీమా పథకంలో దారిద్రరేఖకు దిగువన ఉన్న ఎస్సీ ఎస్టీ రైతులకు 80శాతం ప్రీమియం రాయితీతో నాటు పశువులకు రూ.15వేలు, మేలు జాతి పశువులకు రూ.30వేల వరకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. మూడేళ్ల వ్యవధికి ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించేందుకు రాయితీ అందించింది. రూ.768ల నుంచి రూ.1536లు వరకు ప్రభుత్వం రాయితీ అందించగా రూ.192ల నుంచి రూ.384ల వరకు లబ్ధిదారుని వాటాగా ఉంది. తాజాగా రైతు వాటాను మరో 5 శాతం తగ్గించింది. దీనికి అనుగుణంగా రూ.816ల నుంచి రూ.1632లు ప్రభుత్వం రాయితీ ఇవ్వగా, రూ.144 నుంచి రూ.288ల వరకు లబ్ధిదారుని వాటా తగ్గింది. దారిద్రరేఖకు ఎగువన ఉన్న రైతులకు రూ.480 నుంచి రూ.960ల వరకు అంటే 50శాతం రాయితీ అందిస్తోంది. ఇందులో ఎలాంటి మార్పులు చేయలేదు.

పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి

పశుబీమా పథకంలో రైతు ప్రీమియం వాటా 5 శాతం తగ్గిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాడి పశువులు, మేకలు, గొర్రెలు, పందుల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశువులకు మూడేళ్లపాటు బీమా వర్తిస్తుంది. మేకలు, గొర్రెలు, పందులకు వాటి పెంపకందారులకున్న అవకాశాన్ని బట్టి ఏడాది నుంచి మూడేళ్లపాటు బీమా చెల్లింపులు చేసుకోవచ్చు.



- రమేష్‌నాయక్, పశుసంవర్ధకశాఖ జేడీ

నేడు టెన్నిస్‌బాల్ క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి అజయ్‌కు మార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రాతి పదికన అండర్-19 బాల, బాలికల జట్లు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లా పిడు గురాళ్లలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగే 12వ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశా లల్లో 2025- 26 విద్యా సంవత్సరానికి ప్రవేశా లకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ జీ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు (అక్క చెరువుపాడు), గండిపాళెం, తుమ్మలపెంట, ఆత్మకూరులో 5వ తరగతి, 6, 7, 8 తగరతుల్లో మిగిలిన ఉన్న సీట్లలో ప్రవేశం కోసం అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు గడువును ఈ నెల 6 వరకు ప్రభుత్వం పొడి గించిందని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 25వతేదీ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

20 నుంచి రజకుల రాష్ట్ర మహాసభలు

- రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంకయ్య

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి) : రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 20, 21 తేదీల్లో కొండపల్లిలో జరుగుతా యని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులగుంట అంకయ్య తెలి పారు. రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సంఘం రౌండ్‌టేబుల్ సమావేశం నేరేళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. అంకయ్య మాట్లాడుతూ రజక వృత్తిదారులు చేసే పోరాటాలకు అందరూ మద్దతు తెలపాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడు తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. వెంటనే నిధులివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు కొత్తకోట వెంకటేశ్వర్లు, కంచర్ల సాయి. దేవరకొండ వెంకటేశ్వర్లు, సుధాకర్, సురభి శ్రీనివాసులు, పందేటి సురేంద్ర, గోనిల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన అన్నదమ్ములపై దర్గామిట్ట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఖుద్దూస్ నగర్‌కు చెందిన ఆసీఫ్ బంగారు పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా స్నేహితులు తాహీర్, మస్తాన్, సయ్యద్, ఆజ్‌గర్, హమీద్, అహ్మద్, యస్దాని, సాబీర్, షఫి తదితరులతో కలిసి మాగుంట లేవుట్‌లోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. స్నేహితులందరూ మద్యం సేవిస్తుండగా ఆసీఫ్ కూర్చొని వారితో మాట్లాడసాగాడు. స్నేహి తుడు సాబీర్ మద్యం మత్తులో ఆసీఫ్‌తో గొడవపడ్డాడు. అనంతరం ఆసీఫ్ లాడ్జీ నుంచి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో సాబీర్ అన్న షఫి ఆసీఫ్‌ను అడ్డుకొని తన వద్ద ఉన్న కత్తితో పొట్టలో గట్టిగా పొడిచాడు. సాబీర్ సైతం ఇంకా పొడువు అంటూ అన్నను ప్రోత్సహించాడు. అక్కడకు చేరుకున్న స్నేహితులు అన్నదమ్ములను అడ్డుకొని గాయాలపాలైన ఆసీఫ్ ను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ ఆసుపత్రిలో చేర్పిం చారు. బాధితుడు ఆసీఫ్ మంగళవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రమేష్‌బాబు నిందితులు షఫి, సాబీర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

రూ. 15 లక్షల విలువైన ఎర్రచందనం దుంగల పట్టివేత



పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో అటవీ శాఖ అధికారులు

రాపూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఉదయం తనిఖీల్లో భాగంగా మినీవ్యానులో ఎండుగడ్డి కింద దాచి ఉన్న ఎర్రచందనం దుంగలు బయట పడ్డాయి. వాటిని అటవీ అధికారులు స్వాధీనం చేసున్నారు. రాపూరు రేంజర్ రవీంద్రబాబు కథనం మేరకు వివరాలు... తనిఖీలలో భాగంగా మద్దెలమడుగు చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఉదయం గడ్డి లోడుతో ఉన్న మినీ వ్యానును చెక్‌పోస్ట్ సిబ్బంది ఆపారు. కానీ ఆ వాహ నం రాపూరు నుంచి వెంకట గిరి వైపు ఆగకుండా వేగంగా వెళ్లిపో యింది. అటవీశాఖ అధికా రులు దాన్ని వెంబడించడంతో, డ్రైవర్ వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యాడు. దీంతో ఎర్రచందనం అక్రమ రవాణా బండారం బయటపడింది. 1200 కేజీల బరువైన 89 దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 15 లక్షల వరకూ ఉంటుందని రవీంద్రబాబు తెలిపారు. అనంతరం వాహనాన్ని సీజ్ చేశారు. ఎర్రచందనాన్ని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన రాపూరు రేంజ్ అటవీ అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులను జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో గిరిజన యువకుడి మృతి



మృతుడు దండిపూడి వెంకటేష్ అలియాస్ దానియేల్

అల్లూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మంగళ వారం ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ కిషోర్‌బాబు కథనం మేరకు.. వాకాడు మండలం నిమ్మవానితిప్పకు చెందిన దండిపూడి వెంకటేష్ అలియాస్ దానియేల్ (27) గత ఏడాది కాలంగా అల్లూరులోని క్రిస్టియన్‌పేటలో తన భార్య పావనితో కలసి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో మార్చి 31వ తేదీ మధ్యాహ్నం పావని తన బంధువుల కుటుంబంలో శుభకార్యం ఉండగా తన భర్త స్వగ్రామానికి వెళ్లింది. అదేరోజు రాత్రి వెంకటేష్ అన్న దండిపూడి మోషే తన సోదరుడితో ఫోనులో కాసేపు మాట్లాడాడు. మంగళవారం ఉదయం 8 గంటలకు మోషే తన సోదరుడు వెంకటేష్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. కారణం తెలియకపోవడంతో తమ బంధువులైన అల్లూరు పట్టణ పరిధిలోని ఉద్దీపగుంటలోని అమర్ అనే వ్యక్తికి ఫోన్ చేసి తన సోదరుడి వద్దకు వెళ్లి ఫోన్ చేయించమని కోరాడు. దీంతో అమర్ వెంకటేష్ ఇంటికి వెళ్లి చూడగా వెంకటేష్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఎంత ప్రయత్నించినా లేవకపోవడంతో ఆ విషయాన్ని మోషేకు తెలిపాడు. దీంతో కంగారుపడిన మోషే అల్లూరుకు చేరుకొని చూడగా అప్పటికే వెంకటేష్ మృతి చెంది ఉన్నాడు. పక్కనే మద్యం సీసాలు పడి ఉండడం గమనించిన మోషే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ కిషోర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన భర్త మృతి చెందడాన్ని జీర్ణించుకోలేని భార్య రోదన స్థానికులను కలచివేసింది.

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేసీ

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తోంది. ఏర్పాటయ్యే కమిటీల్లో చోటు లభిస్తుందని ఆశావహులు ఎదురుచూశారు. అయితే, వీరి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా గ్రంథాలయాలకు పర్సన్ ఇన్‌చార్జులుగా జాయింట్ కలెక్టర్లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం జిల్లా గ్రంథాలయ సంస్థకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేసీ కార్తీక్‌కి బాధ్యతలు అప్పగించనున్నారు. మరోవైపు జిల్లా గ్రంథాలయ సంస్థ సమస్యల్లో కూరుకుపోయి ఉంది. నగరవాసులకు నూతన గ్రంథాలయ భవనం కలగానే మిగిలింది. ఆరేళ్లుగా కొత్త భవన నిర్మాణం నత్తనడకను తలపిస్తోంది. నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి రావాల్సిన సెస్సు బకాయిలు రూ.49కోట్లకుపైగా పేరుకుపోయింది. గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పింఛనుదారులకు రెండు నెలలుగా జీతాలు, పింఛన్లు అందక అవస్థలు పడుతున్నారు. రాక ఆకలి బాధల్లో ఉన్నారు. పర్సన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించే జాయింట్ కలెక్టర్ అయినా గ్రంథాలయ సంస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తారన్న ఆశగా ఎదురు చూస్తున్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు సిద్ధం

- అగ్నిమాపక యంత్రాలన్నీ ఫిట్!
- వేసవిలో సిబ్బందికి సెలవుల రద్దు
- 14 నుంచి అవగాహన సదస్సులు
- ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసులురెడ్డి

ఈసారి ఎండలు మండిపోనున్నాయి. గతంతో పోలిస్తే రానున్న మూడు నెలల్లో ప్రచండుడు నిప్పులు కురిపించనున్నాడు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదాలు కూడా ఎక్కువగా సంభవించే అవకాశం ఉంటుంది. కాబట్టి చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

● అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కొంటారు



వేసవి ప్రారంభం కావడంతో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉన్నాము. ఇప్పటికే సిబ్బందికి సెలవులు రద్దు చేశాము. స్టేషన్ పరిధిలో ఉన్న ఫైర్ ఇంజన్‌లతో పాటు, మంటలను ఆర్పేందుకు వినియోగించే పరికరాలు కండీషన్‌లో ఉన్నాయా!? లేవా!? అని అధికారులు పరిశీలించారు. ఏవైనా మొరాయించి ఉంటే వెంటనే మరమ్మతు చేయించారు. అనుకోని ఉపద్రవం వస్తే ఎదుర్కొనేందుకు మా శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది.

● ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా

అగ్నిప్రమాదాలపై పోలీసు, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. వేసవి కాలంలో అధికంగా వచ్చే వడదెబ్బలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. ఈ నెల 14వ తేదీ నుంచి అగ్నిమాపక వారోత్సవాలను పురష్కరించుకొని ప్రజలు, విద్యాసంస్థలు, పరిశ్రములు, వైద్యశాలలు, లాడ్జీలు, హోటళ్లు, షాపింగ్‌మాల్స్ ఇలా వ్యాపార సంస్థలలో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాము. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఫైర్ సిబ్బంది వినియోగించే పరికరాల గురించి ప్రజలకు వివరిస్తాము.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవీ

వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి ఊళ్లకు వెళ్లే వారు గ్యాస్‌ను రెగ్యులేటర్ వద్ద ఆపుకోవాలి. విద్యుదాఘాతం జరగకుండా మెయిన్ ఆఫ్ చేయాలి. వేసవిలో ఏసీలు అధికంగా వినియోగిస్తుంటారు. మనం వినియోగించే కరెంట్‌ను బట్టి ఇంట్లో వైరింగ్ ఉందా లేదా అని పరిశీలించుకోవాలి. ఇక పల్లెల్లో గడ్డివాములు దగ్ధంకావడానికి బాణాసంచా, సిగిరెట్‌లు, బీడీలు తాగి ఆర్పకుండా విసిరేయడం వంటివి ప్రధాన కారణాలు. ఆదిలేనే మంటలను ఆర్పివేస్తే గడ్డి వాములు పూర్తిగా దగ్ధం కావు. అందుకే గడ్డివాములు వేసుకునే వారు ఒక్కో గడ్డి వాముకు 30 మీటర్లు దూరం ఉండేలా చూడాలి. మూడు డ్రమ్ములలో నీటిని నింపుకోవాలి. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక శాఖకు ఫిర్యాదు చేయాలి.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

రూ. 2.58కోట్లతో 964 నీటితొట్టెల మంజూరు

- డ్వామా పీడీ గంగాభవాని

మనుబోలు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామి పథకం కింద రూ. 2.58కోట్లతో 964నీటితొట్టెలు మంజూరయ్యాయని డ్వామా పీడీ గంగాభవాని తెలి పారు. మండలంలోని జట్లకొండూరులో మంగళవారం నీటితొట్టి పనులను ఆమె పరిశీలించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ. 30వేలు ఇస్తారన్నారు. వీటిని వారంలో పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. మండలంలో 11 పంచాయ తీల్లో 27 నీటితొట్టెలు ఏర్పాటు చేయించాలన్నారు. అలాగే జిల్లాకు వర్షపునీటిగుంతలు 7500తవ్వించాలని ఆదేశించారన్నారు. మొదటివిడతగా 2500గుంతలు సెప్టెంబరులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు. వేసవిలో పనిచేసే ఉపాధి కూలీల కోసం మంచినీరు,షెడ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని ఆదేశించారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా తగిన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఏపీవో రాజమ్మ, టీఏలు సుప్రజ, గుర్రప్ప, టీడీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న రైతు



ఆత్మకూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నవాడ గ్రామంలో వెన్నవాడ, గండ్లవీడు మధ్య రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టగా, తమ పొలంలో రోడ్డు వేయడాన్ని నిరసిస్తూ రైతు జగన్నాథం చలమయ్య మంగళవారం అడ్డుకున్నాడు. ఎక్స్‌కవేటర్‌కు అడ్డంగా పడుకున్నాడు. అతనితోపాటు సమీప పొలాల్లోని రైతులు తమ పొలాల్లో రోడ్డు వేయడానికి వీలు లేదని తరలి రావడంతో పని నిలిపివేసి ఎక్స్‌కవేటర్‌తో అక్కడి నుంచి వెనుతిరిగారు. దీంతో రోడ్డు పనులు తాత్కాలికంగా ఆగాయి.

రేపు రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు లోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం రెజ్లింగ్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్రరావు ఓ ప్రక టనలో పేర్కొన్నారు. గ్రీకురోమన్, ఫ్రీస్టయిల్ విభాగాల్లో 15 నుంచి 20 ఏళ్లలోపు వయసు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే ఎంపికలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాజ మహేంద్రవరంలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు .

బంగారంతో వ్యక్తి పరారీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆభరణాలు తయారు చేసేం దుకు ఇచ్చిన బంగారుతో వ్యక్తి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరులోని మండపాలవీధికి చెందిన మోహన్‌లాల్ అరవింద కుమార్ బంగారు ఆభరణాల హోల్‌సేల్ వ్యాపారి. ఆయన పదేళ్లుగా షాకీర్ వద్ద బంగారు ఆభరణాలు తయారు చేయిస్తున్నారు. అరవింద కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఆభరణాల తయారీ కోసం 440 గ్రాముల బంగా రాన్ని షాకీర్‌కు ఇచ్చారు. ఇప్పటి వరకు ఆభరణాలు ఇవ్వకపోగా షాకీర్ కనిపించకుండా పోయాడు. గాలించినా జాడ తెలియక పోవడంతో బాధితు డు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

594 బస్తాల బియ్యం, 20 బస్తాల కందిపప్పు మాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కావలి, ఏప్రిల్ 1(ఆంధ్ర జ్యోతి): కావలి ఎంఎల్ఎస్ పాయింట్ (పౌరసరఫరాల గోదాం) నుంచి 594 బస్తాల రేషన్ బియ్యం, 20 బస్తాల కందిప్పు మాయం అయినట్లు కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ గుర్తించారు. 'గోదాము నుంచి రేషన్ బియ్యం రైస్ మిల్లర్లకు' అనే శీర్షికతో ఈనెల 28వ తేదీన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్డీవో గోదాంను సమగ్రంగా తనిఖీలు చేసి విచారణ చేపట్టినా 594 బస్తాల బియ్యం, 20 బస్తాల కంది పప్పు లెక్కలు తేలలేదు. ఈ మేరకు గోదాం ఇన్‌చార్జిపై నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు ఆర్డీవో మంగళవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పొదుపు నిధుల దుర్వినియోగంపై విచారణ

- డీఆర్‌డీఏ పీడీ



పింఛన్ల పంపిణీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి

రాపూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల వెలుగు కార్యాలయంలోని పొదుపు సంఘాల్లో జరిగిన నగదు దుర్వినియోగంపై విచారణ చేపడుతున్నామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలి పారు. పింఛన్ల పంపిణీలో భాగంగా మంగళవారం ఆమె రాపూరుకు వచ్చారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయంలో జరిగిన అవినీతిపై స్పందించారు. సుమారు రూ. 1.30 కోట్ల దుర్వినియోగం విషయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడుగురికి షోకాజ్ నోటీసులు ఇచ్చామని, వారి వివరణ తరువాత చర్యలు ఉంటాయని తెలిపారు. పెన్షన్లు తెల్లవారు జాము నుంచే పంపిణీ చేస్తున్నామని, పంపిణీ ఎలా జరుగుతుందన్న విషయంపై ఇక్కడ వచ్చామన్నారు. లబ్ధిదారులకు మర్యాద పూర్వకంగా ఇస్తున్నారా, లేదా అనే విషయంపై నేరుగా కొంతమంది ఇళ్లకు వెళ్లి అడిగామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 53.374 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా,, మంగళవారం నాటికి 53.374 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 330, ఉత్తర కాలువకు 300, దక్షి ణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసె క్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కండలేరు డ్యాంలో..

రాపూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 48.51 టీఎంసీలుగా ఉందని డ్యామ్ ఏఈఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1410 క్యూసెక్కులుగా ఉందని అయన తెలిపారు.

బిల్లులు రాగానే పనుల ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలువాయి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి బిల్లులు అందిన వెంటనే పనులు మొదలు పెడతామని, సోమశిల, కండలేరు కాలువ విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వాహకులు తెలియపరచినట్లు తెలుగుగంగ ఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గత నెల 19న ఆంధ్రజ్యోతిలో 'ఆగిన కండలేరు కాలువ పనులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పనులు మొదట్లో వేగంగా జరిగినా, బిల్లులు సకాలంలో అందకపోవడంతో పనులను తాత్కాలికంగా ఏజెన్సీ వారు నిలిపివేశారని తెలిపారు. ఆ తరువాత కొంత మేరకు బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. ఇంకా సుమారు రూ.14కోట్ల బిల్లులు చెల్లించాల్సిందని తెలిపారు. పనుల విషయమై ఏజెన్సీని సంప్రదించగా బిల్లులు వచ్చాక పనులు మొదలు పెడతామని తెలియజేసినట్లు ఆయన వివరించారు.

బుచ్చిలో 96.48, రూరల్‌లో 95.4 శాతం పింఛన్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో మంగళవారం 96.48 శాతం, రూరల్ పరిధిలో 95.4శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీహరిలు తెలిపారు. నగర పంచాయతీలో 4,682 మంది పెన్షనర్లు ఉండగా 4,517 మందికి పింఛను పంపిణీ చేసినట్లు తెలిపారు. బుచ్చి మండల పరిధిలో 5,415 మందికి గాను 5,157 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8765
వెండి కిలో ధర	రూ. 1,03,200
వెండి ఒక గ్రాము	రూ.106.20


పూజలో పాల్గొన్న నాయకులు, గ్రామస్థులు

గ్రామ దేవతలకు చద్ది సమర్పణ

ముత్తుకూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవ తలైన మారెమ్మ, తాళ్ల పరమేశ్వరి కొలువుల్లో భాగంగా మంగళవారం స్థానిక యాదవవీధిలోని వేపచెట్టు వద్ద చద్ది నైవేద్యం, సలిపిండి పానకాలు సమర్పించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో చద్ది నైవేద్యం వైభవంగా జరిగింది. నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కే.రవీం ద్రరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద గొల్ల ముంగమూరు నాగే శ్వరరావు, సుంకర వెంకటేశ్వర్లు, బొలిగర్ల శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి, కొలువు నిర్వహించారు. అనంతరం గంగపెట్టె గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో కమిటీ సభ్యులు వీ. రాము, ఎం.శీనయ్య, డీ.ప్రసాద్, ఎం.శివ, పీ.ప్రసాద్, జీ. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం/మనుబోలు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు మంగళవారం జరిగిన సాంఘీకశాస్త్రంతో ప్రశాంతంగా ముగిశాయి. బుచ్చి మండలంలో 14 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో పీవీ.రత్నం తెలిపారు. పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా పరీక్షలు రాసేవిధంగా అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. ఇక మనుబోలులో పరీక్షలు అయిపోగానే విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్రాల బయటకు వచ్చి కేరింతలు కొట్టారు.

మనుబోలు ఎస్సీ బాలికల హాస్టల్‌కు మోక్షం

● 'పీఎం అజయ్' పథకం కింద భవన నిర్మాణం

మనుబోలు ఏప్రిల్ 1, (ఆంధ్రజ్యోతి) : చాన్నాళ్ల తర్వాత మనుబోలులోని ఎస్సీ బాలికల వసతిగృహానికి మోక్షం లభించింది. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం పీఎం అజయ్ పథకం కింద రాష్ట్రంలో 25 చోట్ల ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలు నిర్మించేలా నిధులు విడుదల చేసింది. ఇందులో జిల్లాకు సంబంధించి మనుబోలు బాలికల వసతిగృహం ఎంపికవగా, రూ.3 కోట్లతో త్వరలో కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. శ్లాబులు దెబ్బతిని, గోడలు పగుళ్ళిచ్చి ఇనుప ఊచలు బయటకు వేలాడుతూ ఉన్న ఈ వసతిగృహంలో ఆరేళ్లుగా విద్యార్థినులు బిక్కు బిక్కుమంటూ చదువుకుంటున్నారు. అయితే, వైసీపీ హయాంలో అప్పటి పాలకులు కనీసం మరమ్మతులపై కూడా దృష్టి పెట్టలేదు. పలుమార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం రాగానే హాస్టల్ దుస్థితిపై టీడీపీ నాయకుడు పచ్చిపాల రామిరెడ్డి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే అత్యవసరంగా విద్యార్థినులను ఎస్సీ బాలుర హాస్టల్‌కు తరలించారు. అక్కడున్న పదిమంది బాలురను ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఓ గదిలో ఉంచాలని సూచించారు. ప్రస్తుతం ఎస్సీ బాలికల హాస్టల్ ప్రతిపాదనల ఫైలును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొత్త భవన నిర్మాణానికి అనుమతులు తెచ్చుకున్నారు.


మనుబోలులోని ఎస్సీ బాలికల వసతిగృహం

గ్రామస్థుల ఆధ్వర్యంలో ముక్కంటమ్మకు పూజలు


విలేకరులతో మాట్లాడుతున్న ముదిరాజ్‌లు, ఆలయ అర్చకుడు

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముక్కంటమ్మ గ్రామస్థుల ఆధ్వర్యంలోనే పూజలు జరిగాయని, మిగతా వారికి ఎలాంటి సంబంధం లేదని కోడూరు గ్రామ శివాలయం వీధిలోని ముదిరాజ్ కుటుంబీకులు తెలిపారు. ముదిరాజ్ కుటుంబీకులు మంగళవారం గ్రామ దేవత ముక్కంటమ్మ ఆలయం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని ముదిరాజుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, గ్రామోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. కానీ కొన్ని మీడియాల్లో శేషు దంపతులు సారథ్యంలో జరిగినట్లు రావడం పట్ల వారు తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ఆ కుటుంబీకులకు ఈ వేడుకలతో సంబంధం లేదని, సాధా రణ భక్తుల మాదిరిగా వచ్చి మొక్కులు చెల్లించు కున్నారని తేల్చి చెప్పారు. గత 15 ఏళ్లగా ముక్కంట మ్మకు తాము ఉగాది పురస్కరించుకుని వేడుకలు చేయడం సాంప్రదాయంగా వస్తున్నదని వారు వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆలయ అర్చకులు, శివాలయం వీధిలోని ముదిరాజ్ కుటుంబీకులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై స్పష్టత ఇవ్వాలి

● బుచ్చిలో క్రైస్తవ సంఘాల నిరసన ర్యాలీ



బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయా లని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలో క్రైస్తవ సంఘాలు, నాయ కులు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ నుంచి బస్టాం డ్ సెంటర్ మీదుగా జొన్నవాడ రోడ్డు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. అనంతరం కొవ్వొ త్తులు వెలిగించి మోకాళ్లపై ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రవీణ్ మృతి అనేక అనుమానాలకు తావి స్తోందని, ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి పాస్టర్‌ది హత్యా.. ప్రమాదమా తేల్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చి పట్టణంలోని పలు క్రైస్తవ సంఘాల బాధ్యులు, పాస్టర్లు, మహిళలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలతో పంట కాలువల కనుమరుగు!

● దర్గాగా లేఔట్లలో కలిపేస్తున్న రియల్టర్లు
● మామూళ్ల మత్తులో నీటిపారుదల శాఖ
● ఆందోళనలో రైతులు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కబ్జాలతో పంట కాలువలు కనుమరుగవుతోన్నాయి. రహదారి పక్కన వేస్తున్న లేఅవుట్లలో కాలువలను కలిపేస్తున్న రియల్టర్లు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెంలో కనిగిరి రిజర్వాయర్ దగ్గర నుంచి ముంబై జాతీయ రహదారి పొడవునా ఇరువైపుల పొతిరెడ్డిపాళెం, దామరమడుగు వరకు, బుచ్చి-రాజుపాళెం మార్గంలో రోడ్డుకు ఇరువైపులా కొడవలూరు మండలం సరిహద్దు వరకు ఎన్నో పంట కాలువలు, కరకట్టలు కబ్జాకు గురయ్యాయి. రెండు ప్రధాన మార్గాలకు మధ్యలో ఉన్న గుడపల్లి కాలువలు, రేబాల కాలువ, పీర్లకాలువ, నాగమాంబాపురం కాలువ, మర్రికాలువ, బాడవకాలువతోపాటు కరకట్టల్లో కొన్నిటి పూర్తిగా తొలగించి కబ్జా చేశారు. మరికొన్ని 50 నుంచి 120 అడుగుల మేర వెడల్పున్న కాలువలను 5నుంచి 10 అడుగులకు కుంచించి కబ్జా చేసి లేఔట్లలో కలిపేసుకున్నారు. సంబంధిత అధికారులకు నోట్లకట్టలు అందజేసి వందలాది ఎకరాల పంటకాలువలు, కరకట్టలను లేఔట్లలో కలిపేసి కోట్లాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపలు ఉన్నాయి. ఇలా అధికారులే అక్రమాలకు, కబ్జాలకు ఆజ్యం పోస్తుంటే రైతులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

● ఇస్కపాళెం-1 పరిధిలో...

బుచ్చి నగర పంచాయతీలోని ఇస్కపాళెం-1 పరిధిలో బుచ్చి-రాజుపాళెం మార్గంలో ఓ లేఔట్‌కు ఎదురుగా మెయిన్ రోడ్డుకు అవతలవైపు వున్న ఓ పొలాన్ని లేఔట్‌కు సిద్ధం చేస్తున్నారు. దాని పక్కనే ఉన్న సాగునీటి (బాడవ) కాలువ, కరకట్టలను చదును చేసి లేఔట్ చేసే పొలంలో కలిపేశారు. ఈ ప్రాంతంలో 40 నుంచి 50కి పైగా పెద్ద తాటిచెట్లును కూల్చేశారు. యినా ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని రైతులు వాపోతున్నారు. కబ్జాకు గురైన కాలువలవల్ల భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తప్పవని ఆయా కాలువల ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టి పంట కాలువలను సర్వే చేయించి హద్దురాళ్ల ఏర్పాటుతో వాటి ఉనికిని కాపాడి భవిష్యత్తరాల రైతాంగానికి మేలు చేకూర్చాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఇస్కపాళెం పరిధిలో పొలంలో వేస్తున్న లేఔట్ కోసం సాగునీటి కాలువ, కరకట్టలు చదును చేసి కలిపేసిన కాలువ, కూల్చేసిన తాటిచెట్లు


గంపలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

పొదలకూరులో పోలేరమ్మకు పొంగళ్లు


పోలేరమ్మకు పొంగళ్లు పెడుతున్న భక్తులు

పొదలకూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి అమ్మవారి నైవేద్యాలను, పూజా సామగ్రిని గంపల్లో పెట్టుకుని ప్రధాన రహదారిపై తప్పెట్లు, మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకలతో అమ్మవారి దేవస్థానం వద్దకు చేరుకున్నారు. అనంతరం మహిళలు అమ్మవారికి పొంగళ్లు, చీర, పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వీటిని పట్టించుకోరా..?

ఉదయగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది ప్రాణాలు కాపాడిన, వైద్యసేవలం దించిన 108, 104 వాహనాలు మరమ్మతు లకు గురైతే పట్టించుకునే నాథుడే కరువ య్యారు. ప్రభుత్వం నూతన వాహనాలను కేటాయించడంతో పాత వాహనాలు మూలకు చేరాయి. ప్రస్తుతం అవి తుప్పుపట్టిపో యాయి. ఆ వాహనాలను ఉదయగిరి సామా జిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వదిలేశారు. వాటిని చూసిన ప్రతిఒక్కరు ప్రభుత్వ ఆస్తులంటే మరీ ఇంత నిర్లక్ష్యమా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలను అందు బాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


మరమ్మతులకు గురైన 108 వాహనం


ఉదయగిరిలో నిరుప యోగంగా 104 వాహనం

కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ'

● వివరాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ ● సాగు అర్హత కార్డులకు చెల్లు చీటి

కోవూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం అములు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకూ వర్తింపచేయనున్నారు. దీని కోసం గతంలో పెట్టిన నిబంధన ప్రకారం సాగు అర్హత కార్డులతో సంబంధం లేకుండా వ్యవసాయ శాఖ అర్హత కలిగిన కౌలు రైతుల వివరాలు సేకరిస్తోంది. జిల్లాలో వరిసాగు చేస్తున్న రైతుల్లో సుమారు 35,000 మంది కౌలు రైతులున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. బ్యాంకులు, సొసైటీలు రుణాలు ఇవ్వకపోగా సాగు అర్హత కార్డులు లేవని ప్రభుత్వం రైతు భరోసా, రాయితీలు వర్తింపచేయలేదు. దీంతో వీరంతా వరి సాగుకు పెట్టుబడుల కోసం ప్రయివేటు వ్యక్తులు, సంస్థలపై ఆధారపడ్డారు. కౌలు రైతులకు ప్రభుత్వ రాయితీలు అందించాలని సీఎం ఆదేశిస్తున్నప్పటికీ నిబంధనల వల్ల లబ్ధి పొందలేకపోతున్నారు.

● నష్టాల ఊబిలో..

కౌలు రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, రైతుకు కౌలు చెల్లింపు, పెరిగిన పెట్టుబడులతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ సక్రమంగా లేకపోవడంతో ధాన్యం ప్రభుత్వ కొనుటోలు కేంద్రాల్లో విక్రయించాలన్నా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. భూ యజమాని పేరుతోనే ధాన్యం అమ్ముకోవాల్సి వస్తోంది .కొందరు యజమానులు కౌలు రైతుల నగదును తమ ఖాతాల్లోనే ఉంచుకుని కౌలుదార్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కౌలుదారులు వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారుల నుంచి సాగు అర్హత కార్డులు పొందలేక ఈ పరిస్థితి నెలకొంది. దీనికి తోడు భూ యజమానులు తమ పొలాన్ని కౌలుకు ఇచ్చినట్లు ధ్రువీకరించక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అన్న దాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింప చేసేం దుకు అర్హతలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సంబంధిత శాఖ అధికారు లను ఆదేశించినట్లు తెలిసింది. దీనికి ఎలాంటి సాగు అర్హత కార్డులు లేకుండా అర్హులను ఎంపిక చేయనున్నారు. దీని కోసం కౌలు రైతుల వివరాలను వ్యవసాయశాఖాధికారులు సేకరిస్తున్నారు. ఈ పోర్టల్‌లో కౌలు రైతులు తమ పేర్లను నమోదు చేసుకుంటే క్షేత్రస్థాయిలో వీఆర్వోలు సమగ్ర విచారణ జరిపి అర్హులను గుర్తిస్తారు. ఈ ప్రక్రియ సక్రమంగా జరిగితే కౌలు రైతులకు లబ్ధి చేకూరనుంది.

అన్నదాత సుఖీభవ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి



మాగ్రామంలో ఎక్కువ మంది కౌలురైతులే. ఆర్థిక సహాయం అందక చాలా ఇబ్బందులు పడుతున్నాం. అన్నదాత సుఖీభవ పథకాన్ని సాగు అర్హత కార్డుల ప్రసక్తి లేకుండా అమలు చేస్తే ఆర్థిక సహాయం అందుతుంది.

- వీరంకి నాగరాజు, రైతు, మోడేగుంట

ఆర్థికసహాయం అందించాలి



కౌలు రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సాగు అర్హత కార్డులు లేనందు వల్ల పుట్టికి రూ.2000 నష్టపోయాను. సీఎం చంద్రబాబు నాయుడు కౌలురైతుల కష్టాల్ని తొలగించాలని కోరుతున్నాం.

- నీలి శ్రీనివాసులు, కౌలు రైతు, కోవూరు.


వరి పైరు

C.R.I.M.E N.E.W.S

పీకేపాడు ఇసుక రీచ్ తనిఖీ : 3 లారీల పట్టివేత


వాహనాలను పట్టుకున్న మైనింగ్ అధికారులు

అనంతసాగరం ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంభంపాడు ఇసుక రీచ్‌ను మైనింగ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను వారు పట్టుకొని కేసులు నమోదు చేశారు. ఈదాడుల్లో ఆర్ఐ స్వాతి, టీపీ వాణీశ్రీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి


సురేష్ మృతదేహం

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో సోమవారం రాత్రి విద్యుదాఘా తానికి గురై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఉదయగిరి సురేష్(38) నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆలయానికి సమీపంలో ఉన్న టెంకాయల దుకాణానికి వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న సురేష్ ఇనుప పైపును పట్టుకొని ఉన్నాడు. వెల్డింగ్ చేసే సమయంలో ఆ పైపునకు విద్యుత్ సరఫరా రావడంతో షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు అతన్ని రక్షించేందుకు సీపీఆర్ చేశారు. అనంతరం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మంగళవారం ఎస్‌ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఈతకెళ్లి యువకుడి దుర్మరణం


మస్తాన్‌బాష మృతదేహం

అనంతసాగరం ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివ రాలు.. మండలంలోని మిన గల్లు చెందిన షేక్ హసేన్-దిల్‌షాద్ దంపతుల కుమారుడు మస్తాన్‌బాష (22) సోమవారం సాయం త్రం ఈత కోసం మిత్రులతో కలసి సమీపంలోని ఉత్తర కాలువకు వెళ్లాడు. కాలువలో ప్రవాహం అధికంగా ఉండటంలో నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, బంధువులు కాలువ వద్దకు చేరుకొని గాలించారు. అప్పటికే చీకటి పడడంతో ఆచూకీ తెలియరాలేదు. మంగళవారం ఉదయం పోలీసులు సహకారంతో మళ్లీ గాలింపు చేపట్టారు. నల్లరాజుపాలెం సమీపంలో మృతదేహం కనిపించగా వెలికితీశారు. చేతికందిన కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..


నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మాగుంటలేవుట్‌లో మంగళవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. రైలు ఢీకొనడంతో గాయపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ హరిచందన తెలిపారు. మృతదేహంపై ఎరుపు రంగు గీతల ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బ్రౌన్ కలర్ లుంగీ ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలో నగదు చోరీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని గోమతి నగర్‌కు చెందిన ప్రసాద్ రావుకు ఇటీవల వాట్సాప్‌లో 'పీఎం కిసాన్' పేరిట ఏపీకే ఫైల్ వచ్చింది. దాన్ని ఆయన తెరిచారు. ఆ తర్వాత గత నెల 29వ తేదీన ఆయన తన ఫోన్‌పే యాప్‌ను ఓపెన్ చేశారు. ఈ క్రమంలో అతని బ్యాంకు ఖాతా నుంచి మూడు దఫాలుగా రూ.2,59,970 నగదు డ్రా అయి నట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ప్రసాదరావు వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. మంగళవారం దర్గామిట్ట పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రోశయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారుల మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలు

● పది రోజులకే గుంతల మయం


పది రోజులకే తారులేక లేచిపోతున్న రోడ్డుపై చేసిన ప్యాచ్‌వర్కు

చేజర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రహదారుల మరమ్మతు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నాసి రకంగా చేపట్టడంతో పట్టుమని పదిరోజులకే అధ్వానంగా తయారవు తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో రహదారులను పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలుత రోడ్లపై గుంతలు పూడ్చాలనే ఉద్దేశంతో పాత్‌ఫర్‌హోల్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఆదురుపల్లి, కొలపనాయుడుపల్లి నుంచి కలువాయి మండలంలోని దాచూరుకు వెళ్ళే రహదారిలో ఇటీవలే గుంతలు పూడ్చివేత పనులు చేపట్టారు. అయితే కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో కంకర లేచిపోయింది. పట్టుమని పది రోజులు కూడా కాకముందే కంకర లేచిపోయి రోడ్డుపై గుంతలు పడడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదని, ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణాలు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్
బుధవారం, 2 ఏప్రిల్ 2025
www.andhrajyothy.com

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	142
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	282

కోడిగుడ్ల ధర (100): 520



ఆర్టీసీలో వైద్య శిబిరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నెల్లూరు రూరల్ టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఉద్యోగులకు వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఎంఎస్ దొడ్ల ఆధ్వర్యంలో 60 కుర్చీలను బస్టాండుకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జోనల్ ఈడీ నాగేంద్ర ప్రసాద్, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొత్తూరులో ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 2వ తరగతి ఆపై తరగతుల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2వతరగతిలో 9 సీట్లు, 3వ తరగతిలో 15, 4వ తరగతిలో 19, 5వ తరగతిలో 25, 6వ తరగతిలో 9 సీట్లు, 7వ తరగతిలో 16, 8వ తరగతిలో 16, 9వ తరగతిలో 6 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. విద్యాలయ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందిస్తామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 11వతేదీ సాయంత్రం 3 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలే కాకుండా ఇతరులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈనెల 17న ప్రకటిస్తామన్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లను సీబీఎస్ఈ ఫలితాలు విడుదలైన పది రోజుల్లో భర్తీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు kothuru.kvs.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

పాలిసెట్ కోసం
బాలికలకు శిక్షణ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 30వతేదీ నిర్వహించనున్న పాలిసెట్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న బాలికలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ యేసుదాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ ఈనెల 28వతేదీ వరకు జరుగుతుందని తెలిపారు. శిక్షణతోపాటు ఉచితంగా పుస్తకాలను అందచేస్తామన్నారు. ఆసక్తి కలిగిన బాలికలు దర్గామిట్ట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆ పనులు
48 గంటల్లో మొదలవ్వాలి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రూరల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో ఇప్పటి వరకు మొదలు కాని 73 అభివృద్ధి పనులను 48 గంటల్లో ప్రారంభించాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం తన కార్యాలయం నుంచి అధికారులు, కాంట్రాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. 91 పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, 139 పనులు వివిధ దశల్లో ఉండగా, 73 పనులు అసలు మొదలు పెట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల నాణ్యతను తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు.

నేత్రదానం



నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీవీ నగర్ షార్ కాలనీకి చెందిన మోహూరు రామలక్ష్మమ్మ (95) మంగళవారం మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ కనుగుడ్లు సేకరించారు. చిరంజీవి ఐ బ్యాంకు ఇన్‌చార్జి సుధీర్ చొరవతో ఈ నేత్రదానం జరిగింది.

దాడి ఘటనపై కేసు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో చిన్నబజారు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని ఖుద్దూస్‌నగర్ నివసించే సిరాజ్‌కు పక్కవీధిలో నివాసం ఉంటున్న నిహాల్‌తో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సిరాజ్ షాదీ మంజిల్ సమీపంలోని ఓ టీ దుకాణం వద్ద ఉండగా నిహాల్ అతనిపై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు ఆర్థిక చేయూత

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల చదువు కోసం అక్షయ ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్థిక చేయూతనందించారు. ఆ ఫౌండేషన్ కార్యదర్శి చెవుల నరేంద్రబాబు మాట్లాడుతూ నగరంలోని జెండా వీధికి చెందిన షేక్ మునీర్ అనారోగ్యంతో తన ఇద్దరు పిల్లలకు స్కూలు ఫీజు చెల్లించలేని పరిస్థితుల్లో తమను ఆశ్రయించారన్నారు. దీంతో తమ ఫౌండేషన్ తరపున మునీర్ పిల్లలు చదువుకునే విద్యోదయ పాఠశాలకు మంగళవారం రూ.20వేల చెక్కును అందచేశామని తెలిపారు. ముందుముందు కూడా ఆ విద్యార్థుల చదువుకు సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు అనుమకొండ నరేంద్రనాథ్, కోశాధికారి వడ్లమూడి ముని వెంకట సతీష్, సభ్యులు అల్తాఫ్, ద్వారక్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉద్వాసన

● 60 ఏళ్లు పైబడ్డ వారిని తొలగించాలని ప్రభుత్వ నిర్ణయం
● నగర పాలక సంస్థలో 58 మంది గుర్తింపు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న పలువురు కార్మికులను విధుల నుంచి తొలగించనున్నారు. మున్సిపల్ పారిశుధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికుల్లో 60 ఏళ్లు నిండిన వారిని విధుల నుంచి తప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



పారిశుధ్య పనుల్లో కార్మికులు (ఫైల్)

కార్పొరేషన్‌లో దీనికి సంబంధించిన ప్రక్రియ మొదలైందని ఓ అధికారి తెలిపారు. నగర పాలిక పారిశుధ్య విభాగంలో ప్రస్తుతం 1497 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 260 మంది రెగ్యులర్ కార్మికులు కాగా మిగిలిన 1257 మంది ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆ ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో 58 మంది కార్మికులు 60 ఏళ్ల వయసు నిండిన వారిగా గుర్తించారు. ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు వారిని తొలగించనున్నారు. అయితే అయితే విధుల నుంచి తొలగించనున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవ కాశం ఇస్తారా...? లేక కొత్త వారిని నియమిస్తారా..? అన్న దానిపై స్పష్టత రావలసి ఉంది.

'ఆప్కాస్' రద్దు చేస్తే ఊరుకోం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్1, (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య విభాగంలో కార్మికులను తొలగించేందుకు ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సరికాదంటూ సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కార్మికులను తొలగించడం సరైన చర్య కాదన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు పారిశుధ్య పనులు అప్పగిస్తే ఊరుకునేది లేదన్నారు. 60 ఏళ్లు నిండిన కార్మికులను విధుల నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించడం సమంజసం కాదన్నారు. అనంతరం డీసీ చెన్నుడుకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, పెంచల నరసింహం పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

● నేడు చెన్నైకి 360 మంది విద్యార్థులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచేందుకు వారిని విహార, విజ్ఞాన యాత్రలకు పంపించాలని నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షలు పర్యటనలకు సన్నాహాలు చేశారు. జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 200 మంది, సెకండరీస్థాయిలో 160 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. టెస్ట్ పరీక్షలు పూర్తవడంతో ఉపాధ్యాయులు కూడా ఈ యాత్రను పూర్తి చేయాలన్న లక్ష్యంతో మంగళవారం విహార యాత్రకు సంబంధించిన పోస్టర్లను జిల్లా సైన్స్ కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి బుధవారం చెన్నైలోని పెరియార్ సైన్స్ సెంటర్, గిండి నేషనల్ పార్క్, మద్రాస్ ఐఐటీ సైన్స్ ఎక్స్‌పోజర్ల విజిట్‌కు వెళుతున్నట్లు చెప్పారు. డీఈవో ఆర్ బాలాజీరావు ఆదేశాల మేరకు 40 మంది ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 360 మంది విద్యార్థులను విహార యాత్రకు తీసుకెళుతున్నామని తెలిపారు. విహార యాత్రకు సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, ఏపీఓ ప్రసాద్, ఎన్‌వీసీ కోఆర్డినేటర్ బాబునాయుడు, జిల్లా సైన్స్ కేంద్రం క్యూరేటర్ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు సుధాకర్, తదితరులు హాజరు కానున్నారు.



విహార యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

లక్ష్యం చూపకుండానే ప్రగతిపై ప్రశంసా?

● చర్చనీయాంశంగా నెల్లూరు కమిషనర్ ప్రకటన

నెల్లూరు (సిటీ), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరంలో నెల్లూరు కార్పొరేషన్ రెవెన్యూ విభాగం ఆస్తి పన్ను వసూళ్ల చేయడంలో ప్రతిభావంతంగా పని చేసిందని కమిషనర్ సూర్యతేజ కొని యాడుతూ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఇది అధికార, ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలపై పన్ను రూ.77.76 కోట్లు వసూలు చేశారని, ఇది గతేడాదితో పోల్చితే రూ.11.38 కోట్లు అదనమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పైగా సోమవారం సెలవు దినం అయినప్పటికీ ఆ ఒక్కరోజే రెవెన్యూ సిబ్బంది రూ.2.85 కోట్లు వసూలు చేశారని ప్రశంసించారు. ఇదంతా బాగానే ఉన్నా అసలు వసూలు చేయవలసిన పన్ను లక్ష్యం ఎంతో మాత్రం ఆ ప్రకటనలో వెల్లడించకపోవడం కార్పొరేషన్ వర్గాలను విస్మయానికి గురి చేసింది. డిమాండ్ ఎంతో చెప్పకుండా వసూళ్లను మాత్రమే గొప్పగా చెప్పుకోవడం అధికారులు, సిబ్బందిలో చర్చకు దారి తీసింది.

ఆనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాయకుల పేట రైల్వే గేటు వద్ద అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడు మంగళవారం మృత చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ హరిచందన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, బులుగు, తెలుపు రంగుల గీతల లుంగీ ఉన్నాయని, మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్తకి సెంటర్‌లో మంగళవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నర్తకి సెంటర్‌లో ఈనెల 5న భక్తిగీతాల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాటూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కేతా సుబ్బారావు తదితరులు

'కృష్ణచైతన్య'లో వార్షిక సంబరాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కృష్ణచైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవ సంబరాలు నగరంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం జరిగింది. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు అతిథిగా హాజరై ప్రసంగించారు. కృష్ణ చైతన్య విద్యా సంస్థలో చదువుకున్న వారు బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగం చేస్తుండటం అభినందనీయమన్నారు. ముందుముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల నాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించిందని, త్వరలోనే ఏ ప్లస్ గ్రేడ్ సాధించేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం పీజీలో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు వర్సిటీ వీసీ బంగారు పతకాలు అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్ జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాద్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వీసీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

సాంఘిక సంక్షేమ శాఖ
అధికారుల పనితీరు అధ్వానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల పనితీరు అధ్వానంగా ఉందని జిల్లా అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మురళీకృష్ణ యాదవ్ ఆరోపించారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో రెండేళ్లుగా హెచ్‌డబ్ల్యూవోలు విద్యార్థుల హాజరు తప్పుగా నమోదు చేసి నిధులు స్వాహా చేస్తున్నారని, వీరిపై ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. ఆ శాఖ డీడీకి ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి నాయకులు నాయబ్ రసూల్, మహేష్ గౌడ్, రాము, నరేష్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడం

● ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులు, అరెస్ట్‌లకు ఎవరూ భయపడరని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

భక్తితో కొలిస్తేనే మోక్షం

● అవధాని రాజశేఖర్



అవధాని రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : బలవంతులమని గర్వపడితే భగవంతునికి దూరమవుతారని, భక్తితో కొలిస్తేనే మోక్షం లభిస్తుందని అదే గజేంద్ర మోక్షం సారమని అవధాని కోట రాజశేఖర్ తెలిపారు. నగరంలోని నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో వసంత నవరాత్రి సప్తాహ ప్రవచనాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆయన గజేంద్ర మోక్షంపై ప్రవచించారు. రాబోయే మూడు రోజులు కృష్ణావతారంపై ప్రవచనం చేస్తానని తెలిపారు. కాగా, ఆలయంలో ద్రౌపదీదేవికి విశేష అర్చనలు, నవగ్రహ హోమం, శ్రీసూక్త, పురుష సూక్త హోమాలు జరిగాయి. ఉభయదాతలుగా తంజావూరు నాగేశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్ర, ఆలయ ఈవో దుర్గయ్య, సాదా నాగేంద్ర కుమార్, స్వామి సమయానంద, రామసుబ్రహ్మణ్యం శర్మ, అర్చకుడు లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలు

నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగు తున్నాయి. మంగళ వారం ఉదయం సీతారాములకు తేనెతో అభిషేకం జరిగింది. ఉదయం, సాయంత్రం బిల్వపత్రాలతో అర్చన, మారేడు సమిధలతో హోమాలు జరిగాయి. ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వర రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బరాజు పర్యవేక్షించారు.

బ్యాంకులు సర్‌చార్జీలు రద్దు చేయాలి

● ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత సంఘర్షణ సమితి ధర్నా

కావలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకులు సర్‌చార్జీలు రద్దు చేసి చేసి దోపిడీని అరికట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పర్యాయాలకు మించి ఏటీఎంలలో లావాదేవీలు జరిపితే రూ.50లు కట్ చేస్తున్నారన్నారు. ఏడాదిపాటు లావాదేవీలు జరుగకపోయినా, బ్యాంక్ ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోయినా డబ్బులు కట్ చేస్తున్నారన్నారు. పేదవారి దగ్గర సర్‌చార్జీల పేరుతో వసూళ్లు చేసి పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇస్తుండటంతో వారు బ్యాంక్‌లకు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి నేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి లక్ష్మయ్య, నాగబోయిన భాస్కర్, ఎం.లక్ష్మీనర్సు, జెడ్డా వాసు, ఆలూరు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

పాస్టర్ మృతిపై విచారణ జరపాలి

● కలెక్టరేట్ ఎదుట పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ధర్నా

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం పాస్టర్లు ధర్నా చేశారు. పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గడ్డం హనోక్ మాట్లాడుతూ మార్చి 24న రాజమహేంద్రవరం కొంతమూరు వద్ద పాస్టర్ ప్రవీణ్ మృతి చెందారన్నారు. దీనిపై చాలా అనుమానాలు ఉన్నాయని, విచారణ జరపాలని కోరారు. ఆయనది హత్య అని తేలితే నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం జాషువా, కోశాధికారి సోడం ఎనోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా సునీల్ గవాస్కర్, రూరల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌వద్ద ధర్నా చేస్తున్న పాస్టర్లు

ఈ రబీలో
మూడున్నర పుట్లే!

● ఎకరాకు అర పుట్టి తగ్గిన దిగుబడి
● వెన్ను దశలో ప్రతికూలతే కారణం
● ఉష్ణోగ్రతల్లేక పంటపై ప్రభావం
● కౌలు రైతులకు నష్టం


నెల్లూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లో ప్రస్తుత రబీలో సీజన్‌లో వరి దిగుబడి తగ్గింది. ప్రస్తుతం గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో 15-20 రోజుల్లో ఆయకట్టు, లోతట్టు ప్రాంతాల్లో కోతలు పూర్తికానున్నాయి. సరాసరిన ఎకరాకు మూడున్నర పుట్ల ధాన్యం మాత్ర మే రైతులకు చేతికందుతోంది. గతేడాదితో పోల్చితే ఎకరాకు అర పుట్టి వరకు ఫలసాయం తక్కువ వచ్చింది. పంట వెన్ను దశలో ఉన్న ప్పుడు ప్రతికూల వాతావరణమే దీనికి కారణమని రైతులు భావిస్తున్నారు. చలి, వేడి ఉష్ణోగ్రతల్లో సమతుల్యత లోపించడం కూడా దిగుబడులు తగ్గడానికి కారణమనేది వ్యవసాయ అధికారుల విశ్లేషణ.

నగర పరిసరాలు, రూరల్ మండలంలోని గ్రామాల్లో రబీలో 25 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆర్ఎన్ఆర్, కేఎన్ఎం, బీపీటీ, ఎన్ఎల్ఆర్ రకాలను పండించారు. వర్షాల కారణంగా అదును తప్పి నారేతలేశారు. పంట వెన్నుతీసే సమయానికి చలి, మంచు కమ్మేశాయి. పగటి, రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వాతావరణం పైరుకు ప్రతికూలంగా మారింది. ఆ ప్రభావం దిగుబడిపై చూపింది. మోటార్ల కింద ముందుగానే సాగు మొదలుపెట్టిన రైతులకు కూడా ఆయకట్టు రైతులకు వచ్చినట్లే దిగుబడులు రావడం గమనార్హం. నెల్లూరుకు తూర్పునున్న గ్రామాలైన కాకుపల్లి, పెనుబర్తి, మాదరాజుగూడూరులో ఎకరాకు నాలుగు పుట్ల వరకు దిగుబడి వచ్చినప్పటికీ పడమర గ్రామాల్లో మాత్రం మూడు, ఎక్కువ శాతం మూడున్నర పుట్లే చేతికందాయి.

● కౌలు రైతుల దిగాలు

దిగుబడి తగ్గడంతో కౌలుకు సేద్యం చేస్తున్న రైతులు నష్టపోతున్నారు. ఈ సారి దుక్కులు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీల రేట్లు పెరగడం, మార్కెట్లో ధాన్యం ధరలు గణనీయంగా పడిపోవడం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలున్నప్పటికీ వాటిలో వడ్లు అమ్మేందుకు సుముఖత చూపకపోవడం వంటి కారణాలతో నష్టాలను చవి చూస్తున్నారు. పీపీసీల్లో పుట్టి ధాన్యాన్ని రూ. 19,720లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నప్పటికీ అక్కడ పెట్టే కొర్రీలు, మిల్లర్ల విముఖత, సమయానికి అందుబాటులోకిరాని లారీలు, కూలీల ఖర్చులు లెక్కకడుతున్న రైతులు బయట మార్కెట్లో పుట్టి రూ. 17,500లకు తెగనమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో పంట పెట్టుబడి, కౌలు మొత్తం కలిపితే నష్టమే మిగులుతోందని కౌలు రైతులు వాపోతున్నారు.





● మరో రెండు నెలల్లో


తిరుపతి కొత్త రైల్వే స్టేషన్ అందుబాటులోకి

నయా స్టేషన్ ఆగయా

● తుదిమెరుగులు దిద్దుకుంటున్న దక్షిణంవైపు నిర్మాణాలు

● వచ్చే ఏడాది జూన్‌లో ఉత్తరంవైపు భవనం పూర్తి

తిరుపతి
तिरुपति
TIRUPATI



నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న ఎస్కలేటర్

తిరుపతి, (సెంట్రల్), ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో దక్షిణ వైపు నిర్మిస్తున్న నూతన భవనం అందుబాటులోకి రానుంది. రూ.300కోట్లతో వరల్డ్ క్లాస్ రైల్వేస్టేషన్‌గా తిరుపతిని మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే శ్రమిస్తోంది. దక్షణవైపు తుదిదశకు చేరుకున్న నిర్మాణాలను రైల్వే అధికారులు మీడియా ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. 'దక్షిణమధ్య రైల్వేకు చెందిన ప్రధాన రైల్వే స్టేషన్లు సికింద్రాబాద్, నెల్లూరు, తిరుపతిలో అభివృద్ధి పనులు జరగుతున్నాయి. వీటిలో తిరుపతిలో మరింత వేగంగా పనులు జరుగుతున్నాయి. తిరుపతి రైల్వే స్టేషన్ అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం రూ.300కోట్లతో పనులు ప్రారంభించింది. ప్రస్తుతం తిరుపతి రైల్వే స్టేషన్లో 80వేల మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో 1.5 లక్షల మంది రాకపోకలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ నిర్మాణాలు చేపడుతున్నాం. ఇప్పటికి 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఉత్తరంలో నిర్మిస్తున్న పనులు వచ్చే ఏడాది జూన్‌లోపు పూర్తవుతాయి. ప్రస్తుతం తిరుపతి రైల్వే స్టేషన్లో ఆరు ప్లాట్ ఫాంలు ఉన్నాయి. మరో రెండు పెంచేందుకు ప్రతిపాదనలు పంపాం' అని వివరించారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ డాక్టర్ చిన్న రెడ్డెప్ప, ఏడీఈఎం ప్రభాకర్, పీఎంసీ నిర్మల్ కుమార్, కాంట్రాక్టర్ సంజయ్ కఠారే, ఆర్కే సింగ్, ఐపీఎఫ్ సందీప్ కుమార్, జీఆర్పీ సీఐ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకతలివీ

ప్రస్తుతం నిర్మిస్తున్న జీ+3 భవనాల్లో (ఉత్తర-దక్షిణ భవనాలను కలుపుతూ) రెండు ఎయిర్ కాన్ కోర్సులు ఏర్పాటు చేశారు. వీటికి అనుసంధానంగా 12 ఎస్కలేటర్లు, 10 లిఫ్టులు పనిచేస్తాయి. వీటితో పాటు ప్రస్తుతమున్న రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కూడా ఉంటాయి. దక్షిణ దిక్కున కొత్త భవనంలోని అండర్ గ్రౌండ్‌లో 400 వాహనాలు పార్కింగ్ చేసుకునే సౌకర్యం ఉంది.

గ్రౌండ్ ఫ్లోర్: టికెట్ బుకింగ్ కౌంటర్లు, రిజర్వేషన్ కౌంటర్లు, ప్రయాణికుల విశ్రాంత గదులు, రైల్వే ఆపరేటింగ్ ఉద్యోగుల కార్యాలయాలు, ఎస్ఎంఆర్, ఏఎస్ఎం కార్యాలయాలు, వీఐపీ లాంజ్‌లు, క్లాక్ రూంలు ఉంటాయి.

ఫస్ట్ ఫ్లోర్: విశ్రాంత గదులు, ఫుడ్ కోర్టులు, దుకాణాలు

సెకండ్ ఫ్లోర్: రైల్వే విభాగాల కార్యాలయాలు, రిటైరింగ్ గదులను (ఆరు లిఫ్టులు, నాలుగు ఎస్కలేటర్లు) అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ నూతన భవనంపై మరో 7 అంతస్థులు పీపీపీకింద విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టులు నిర్మాణాలు చేపట్టే యోచనలో ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తదితరులు

రెండో ఉచిత సిలిండర్‌కు బుకింగ్స్

● నాలుగు నెలల వ్యవధిలో పొందే సౌలభ్యం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దీపం-2 కింద రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ ఒకటి నుంచి జూలై ఒకటవ తేదీ వరకు ఈ ఉచిత రెండో సిలిండర్‌ను బుక్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4,92,302 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అక్టోబరు 29 నుంచి మార్చి 31వ తేది వరకు తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించగా.. దాదాపు 4.74 లక్షల మంది వినియోగించుకున్నారు. వారిలో ఇప్పటి వరకు 4.58 లక్షల మందికి మాత్రమే సిలిండర్ రాయితీ నగదు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఇక, రెండో సిలిండర్ బుకింగ్ మంగళవారం మొదలవగా.. తొలిరోజే దాదాపు 700 సిలిండర్లు బుక్ అయినట్లు సమాచారం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలలకు ఒకటి చొప్పున.. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను ఇస్తోంది. రేషన్ కార్డు ఉన్న వారందరూ అర్హులే. కాగా, వినియోగదారులు నగదు చెల్లించి సిలిండరును తీసుకున్న 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లోకి ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. అయితే మొదటి సిలిండర్‌కు సంబంధించి జిల్లాలో ఇంకా దాదాపు 16 వేల మందికి నగదు జమ కాలేదు. దీనికి కారణం చాలా మంది ఈకేవైసీ చేసుకోక పోవడం, మరికొందరు బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడమేనని అధికారులు అంటున్నారు. అలాగే, ఒకే కార్డుపై రెండు గ్యాస్ సిలిండర్లు ఉన్నా డబ్బులు పడవని అంటున్నారు. వీటిని అధిగమిస్తే వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని చెబుతున్నారు. వీటికి సంబంధించి అనుమానాలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు.

రూ.2.63 లక్షల పింఛను సొమ్ముతో పరార్

● సచివాలయ ఉద్యోగిని సస్పెండు చేసిన కలెక్టర్

సత్యవేడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పింఛను సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారైన ఘటన సత్యవేడు మండలంలో మంగళవారం జరిగింది. తన పరిధిలోని లబ్ధిదారులకు పింఛను అందజేసేందుకు కాళమనాయుడుపేట సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ షాహిదుల్లా సోమవారం కార్యాలయం నుంచి రూ.2,63,000 తీసుకున్నాడు. ఈ సొమ్మును కొత్తమారికుప్పంలో 63 మందికి పంపిణీ చేయాలి. మంగళవారం ఉదయం 11 గంటలవుతున్నా లబ్ధిదారులకు నగదు అందలేదు. ఈ విషయం తెలిసి షాహిదుల్లాకు ఎంపీడీవో చంద్రశేఖర్ ఫోను చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. అతడి గురించి పలు చోట్ల విచారించినా ఆచూకీ లేదు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, షాహిదుల్లా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటాడని గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదులందాయి. రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం, అధికారులతో ప్రవర్తన సరిగా లేకపోవడం, విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం,శాఖాపరమైన పథకాల అమల్లో నిర్లక్ష్యం తదితర అంశాలపై పలుమార్లు ఆయన్ను ఉన్నతాధికారులు హెచ్చరించినా మార్పు రాలేదు.కాగా, పింఛన్ సొమ్ము పంపిణీ చేయకుండా, నగదు దుర్వినియోగం చేసిన షాహిదుల్లాను పెండింగ్ ఎంక్వైరీ కింద సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పింఛన్ల పంపిణీలో జిల్లాకు మొదటిస్థానం

● 96.42 శాతం పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో ఈనెల కూడా రాష్ట్రంలో జిల్లాకు మొదటిస్థానం లభించింది. ఎల్-1 ఆర్‌డీ పరికరాలతో సచివాలయ సిబ్బంది మంగళవారం పింఛన్లు పంపిణీ చేయడంతో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తలేదు. జిల్లాలో 2,61,841మంది కిగాను తొలిరోజు 2,52,462 మందికి (96.42శాతం) పింఛన్లు అందజేశారు. 691 సచివాలయాల పరిధిలో సుమారు 5,700మంది సిబ్బంది ఉదయం 7గంటల నుంచి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



నారాయణవనంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

నారాయణవనం, ఆంధ్రజ్యోతి: డీఆర్డీఏ పీడీ శోభన్ బాబుతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం నారాయణవనంలో పింఛన్ల పంపిణీని తనిఖీ చేయడమే కాకుండా పంపిణీ చేశారు. జిల్లా ఇన్‌చార్జి అధికారి కోన శశిధర్ వీడియో కాల్ ద్వారా లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ జయరాములు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో 'తిరుపతి' రికార్డ్

2024-25 ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ ఖాతాలోకి రూ.100 కోట్లు

వసూలైన పన్ను వివరాలు

ఆస్తిపన్ను: రూ80.44కోట్లు
ఖాళీస్థలాల పన్ను (వీఎల్టీ): రూ9.92కోట్లు
నీటి పన్ను: రూ8.18కోట్లు
మురుగునీటి పన్ను: రూ1.50కోట్లు

తిరుపతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థకు రికార్డు స్థాయిలో పన్నులు వసూలయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను వివిధ రకాల పన్నుల కింద రూ.100కోట్లు జమయ్యాయి. 2023-24లో దాదాపు రూ84కోట్లు మాత్రమే వసూలైంది. ఈసారి రూ.వంద కోట్ల మార్కు దాటడంతో పాటు పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో తిరుపతి మూడో స్థానంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. పన్నుల వసూళ్లలో కమిషనర్ మౌర్య, అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టడం, ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీని పన్నుదారులు పెద్దఎత్తున వినియోగించుకున్నారు. ఇక, తిరుపతి నగరంలో ఖాళీ స్థలాల పన్నులు (వీఎల్టీ) చెల్లించడం తొలి నుంచీ వెనుకంజలో ఉంది. ఎంత ఒత్తిడి చేసినా రూ4కోట్లు పైన వసూలైన సందర్భాలు లేవు. వీఎల్టీలపైన కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఖాళీ స్థలాల యజమానులు స్పందించకపోతే ప్రభుత్వ స్థలమని బోర్డులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. వీఎల్టీ చెల్లించకుండా టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు నిబంధనలు ఒప్పుకోవని చెప్పడంతో ఈఏడాది దాదాపు రూ10కోట్లు వీఎల్టీ వసూలైందని కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ, టీటీడీ పన్నులు అటుంచితే.. ప్రైవేట్ ఆస్తులనుంచి బకాయిలతో పాటు రావాల్సిన దాదాపు రూ98కోట్ల పన్నులలో ఆర్థిక సంవత్సరం ముగింపునాటికి 97.5శాతం వసూలు కావడం విశేషం.

పరీక్షలు అయిపోయాయోచ్..!



అమ్మతో ఆనందంగా..



స్నేహానికి గుర్తుగా సెల్ఫీ

● సందడి చేసిన టెన్త్ విద్యార్థులు

● రేపటి నుంచి మూల్యాంకనం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజున సోషల్ పరీక్ష అయిపోగానే.. ఆయా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు సందడి చేశారు. కేరింతలు కొడుతూ... తల్లిదండ్రులను సంతోషంగా హత్తుకుంటూ ఆనందం పంచుకున్నారు. తొలి షెడ్యూల్ ప్రకారం సోమవారంతోనే పరీక్షలు ముగియాలి. కానీ, 31వ తేదీన రంజాన్ రావడంతో ఆరోజున ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటిస్తూ పరీక్షను మంగళవారానికి వాయిదా వేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 310 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 15,455 మంది విద్యార్థులు, 283 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 11,548 విద్యార్థులు, మరో 634 మంది ప్రైవేటు విద్యార్థులు మొత్తం 28,656 మంది పదోతరగతి పరీక్షలు రాశారు. వీరి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు జరగనుంది. ఒకవేళ పేపర్లు కాస్త ఎక్కువగా వస్తే ఆపైకూడా ఒకట్రెండు రోజులు మూల్యాంకనం జరిగే అవకాశం ఉంది. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వారం రోజులపాటు జరిగే మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్లను నియమించారు. ఒక ఎగ్జామినర్ ప్రతిరోజూ 40 పేపర్లను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది.

విద్యార్థుల కేరింత



అంతర్రాష్ట్ర దొంగ పరార్

● విషయాన్ని బయటకు పొక్కనీయని రేణిగుంట అర్బన్ పోలీసులు

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

రేణిగుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నుంచి అంతర్రాష్ట్ర దొంగ పరారైన ఘటన మంగళవారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం వారపు సంతలో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న ఓ వ్యక్తిని ఐడీ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న కౌన్సెలింగ్ భవనంలో అతడిని విచారించారు. నిందితుడి వేలిముద్రలను పరిశీలించగా.. అతడిపై కర్ణాటకలో 47 చోరీ కేసులు ఉండటం, ఆ రాష్ట్రంలో మోస్ట్ వాంటెడ్ దొంగగా ఉండడాన్ని గుర్తించి బెంగళూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత ఏమైందోగానీ శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో దొంగ పరారయ్యాడని తెలిసింది. మరోవైపు రేణిగుంటకు చేరుకున్న కర్ణాటక పోలీసులు.. అర్బన్ పోలీసులతో కలిసి నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై డీఎస్పీ శ్రీనివాసరావును వివరణ కోరగా.. కర్ణాటక రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ దొంగ రేణిగుంట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమైనట్లు చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించగా రాత్రి తప్పించుకొనిపోయాడన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్-2

తిరుపతి(విద్య), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్- 2 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 2 4వ తేదీ వరకు, ఆ తర్వాత 7 నుంచి 9వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. తిరుపతి చెర్లోపల్లి సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ కేంద్రంగా ప్రతీరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లుగా పరీక్షలు జరుగుతాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సిటీ కోఆర్డినేటర్ టి. కైలాష్‌నాథ్ తెలిపారు. తొలి మూడు రోజుల్లో జరిగే పరీక్షలకు సుమారు 3వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి రోజు రెండు సెషన్లలో 1,156 మంది పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం సెషన్‌కు వచ్చే విద్యార్థులు 7 గంటలకే పరీక్ష కేంద్రంవద్దకు చేరుకోవాలి. 8.30 గంటలకే కేంద్రం గేట్లు మూసివేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే పరీక్ష కోసం విద్యార్థులు 12 గంటలకే కేంద్రం వద్దకు చేరుకోవాలి. 1.30 గంటలకు గేట్లు మూసివేస్తారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నకిలీ సర్టిఫికెట్ల ముఠాపై విచారణ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో కొందరు సిబ్బంది గతంలో పని చేసి వెళ్లిన అధికారులు, డాక్టర్ల పేరుతో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తుండటంపై అధికారులు విచారణ చేపట్టారు. ఇక్కడ నకిలీ మెడికల్, సదరం సర్టిఫికెట్ల జారీపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో రుయాలో నకిలీ సర్టిఫికెట్ల ముఠా శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ రుయా అధికారులను ఆదేశించడంతో మంగళవారం విచారణ చేపట్టారు. ఏంఆర్‌డీ విభాగంలోని కొందరు సిబ్బందిని పిలిచి మందలించినట్లు సమాచారం.





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మొదటిఘాట్‌లో అదుపుతప్పిన టీటీడీ టెంపో

● ఏడుగురికి గాయాలు

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో మంగళవారం టీటీడీకి చెందిన టెంపో వాహనం అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. దీంతో ఐదుగురికి గాయాలయ్యాయి. తిరుమలలో అనధికారికంగా ఉంటున్న వ్యక్తులను వారం రోజులుగా విజిలెన్స్, పోలీసులు గుర్తించి తిరుపతికి తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే మంగళవారం కూడా 22 మందిని గుర్తించారు. వీరిని బైండోవర్ చేసేందుకు టెంపో వాహనంలో తిరుమల నుంచి తిరుపతికి తరలిస్తుండగా మార్గంలోని చివరి మలుపు వద్ద వాహనం అదుపుతప్పింది. పిట్టగోడను ఢీకొంది. ఈప్రమాదంలో ఐదుగురు భక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. వాహనంలో 14 మంది మాత్రమే ఉన్నారని, మిగిలిన వారు ఆర్టీసీ బస్సులో వెళ్లారని పోలీసులు చెబుతున్నా నిబంధనలకు విరుద్ధంగా 22 మందిని ఎక్కించినట్టు తెలుస్తోంది.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.04 కోట్లు


సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,007

తలనీలాలు సమర్పించినవారు: 27,440



విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ఓ కీలకమలుపు. మ్యాథమేటిక్స్ కోర్సులవైపు వెళ్లాలా... లేక సైన్స్ కోర్సుల్లో చేరాలా అనే విషయాన్ని నిర్ధారించుకునే తరుణమిదే. ఈ దశలో ఎంపిక చేసుకున్న గ్రూప్ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఆసక్తి ఉన్న అంశాన్నే ఎంపిక చేసుకోవాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. మ్యాథ్స్ కోర్సులకు ఎంపీసీ, సైన్స్ కోర్సులకు బైపీసీ తీసుకుంటారు. ఈ రెండూ చదవాలనుకుంటే ఇప్పటివరకూ కుదరని పరిస్థితి. కానీ తాజాగా రెండు గ్రూపులూ చదివేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అంతేకాదు ముఖ్యమైన ఇంటర్మీడియట్ విషయంలో కొన్ని మేలైన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



కొత్తగా ఎంబైపీసీ

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు అందుబాటులోకి రానుంది. ఆరు సబ్జెక్టులతో ఎంబైపీసీ చదవచ్చు. లాంగ్వేజి సబ్జెక్ట్ ఇంగ్లిష్ తప్పనిసరి. తరువాత సెంకడ్ లాంగ్వేజి ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చు. ఇవికాకుండా గణితం, బయాలజీ, ఫిజిక్స్, కెమెస్ట్రీ సబ్జెక్టులు ఈ గ్రూప్‌లో ఉంటాయి. ఎంపీసీ విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్‌గా హిందీ, సంస్కృతం, ఉర్దూ కాకుండా బయాలజీ తీసుకుని ఎంబైపీసీ చదవవచ్చు. బైపీసీ విద్యార్థులు గణితాన్ని తీసుకుని ఎంబైపీసీ గ్రూపు చదవవచ్చు. ఎంబైపీసీ తీసుకున్న విద్యార్థులకు అవకాశాలు విస్తృతమతుతాయి. వీరు ఇటు మెడిసిన్, అటు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ఎంబైపీసీ గ్రూపునకు మంచి స్పందన లభించనుంది.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు: 21

ప్రయివేట్ జూనియర్ కాలేజీలు: 132

ఇతర యాజమాన్య కళాశాలలు: 7

ప్రథమ సంవత్సర విద్యార్థులు: 32,689

ఇంటర్‌లో సంస్కరణలకు నాంది

ఈఏడాది నుంచి కొత్తగా ఎంబైపీసీ గ్రూప్

మెడిసిన్, ఇంజనీరింగ్‌ల్లో చేరికకు అవకాశం

గణితం, బోటనీ, జువాలజీ కలిపి బయాలజీ

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు శ్రీకారం

ఇప్పటివరకూ ఇంటర్మీడియట్‌లో ఆరు సబ్జెక్టుల విధానం ఉంది. సైన్స్ గ్రూపుల్లో రెండు భాషా సబ్జెక్టులు, నాలుగు కోర్ సబ్జెక్టులు, ఆర్ట్స్‌లో రెండు భాష, మూడు కోర్ సబ్జెక్టులు ఉన్నాయి. ఇకపై ఐదు సబ్జెక్టుల విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఎంపీసీలో గణితం ఏ, బీ పేపర్లుగా ఉంది. దీనిని ఒకే సబ్జెక్ట్‌గా మార్చింది. బైపీసీలో బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా చేసింది. దీనివల్ల సైన్స్ గ్రూపుల్లో కోర్ సబ్జెక్టులు ఐదు నుంచి నాలుగుకు తగ్గాయి. ఎంపీసీలో గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ, ఇంగ్లిష్ తప్పనిసరిగా ఉంటాయి. మరో సబ్జెక్ట్‌గా తెలుగు, సంస్కృతాన్ని ఐచ్ఛికంగా తీసుకోవచ్చు. బైపీసీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్‌తోపాటు ఒక ఎంపిక సబ్జెక్ట్ ఉంటుంది. ఆర్ట్స్ గ్రూప్‌లో కూడా గణితం, బయాలజీలను ఆప్షనల్‌గా తీసుకోవచ్చు. 6వ సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశం లేదు. రెండో స్థానంలోని లాంగ్వేజ్ సబ్జెక్టును మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంటుంది.

ఎన్‌సీఈఆర్టీ సిలబస్

ఇంటర్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఈ ఏడాది పదవ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్ బోధించినందున ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ఈ సిలబస్‌ను ప్రారంభించనున్నారు. రెండో సంవత్సర విద్యార్థులకు పాత విధానమే కొనసాగనుంది. పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాలు, తరగతుల నిర్వహణ విధానాలను సీబీఎస్ఈ విధానంలోకి మార్చారు. ఆమేరకు ఏప్రిల్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ వరకు కొత్త సిలబస్‌పై ఓరియంటేషన్ తరగతులు జరుగనున్నాయి. 7 నుంచి ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులిస్తారు. జూన్ 2వ తేదీన కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సీబీఎస్ఈ సిలబస్ పుస్తకాలతోపాటు నోట్‌పుస్తకాలు, రికార్డు షీట్లను ప్రభుత్వమే ఉచితంగా విద్యార్థులకు అందించనుంది.





రేపటి మన సమాజ భవిష్యత్తు అయిన చిన్నారుల్లో పుస్తకాభిలాష తగ్గుతూ ఉంది. పిల్లల్లో పుస్తక పఠనాసక్తి పెంచితే సామాజిక బాధ్యత, నైతిక విలువలు అలవడతాయంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఉపాధ్యాయులు, సాహిత్యవేత్తలు. నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

పుస్తకం చదివితే ప్రపంచ విజ్ఞానం

● నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోను, కంప్యూటర్ ద్వారా నిత్యం యూట్యూబ్, వాట్సప్, ఫేస్‌బుక్‌లో గడిపే ఈ తరానికి పుస్తక పఠనాసక్తి తగ్గింది. దీనివల్ల చిన్నారులకు నిజమైన ప్రాపంచిక జ్ఞానం అందడం లేదు. దీంతో సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెంపొందడం లేదు. ఒకనాడు ఊరిలో, ఇంట్లో పుస్తకాలు, కళల ద్వారా విజ్ఞానం అందేది. గుడిలో భజన, కోలాటం, చెక్క భజన, మహాభారతం వంటి కళా రూపాల ద్వారా ఎన్నో విలువలు అందేవి. పత్రికల ద్వారా.. బొమ్మల ద్వారా.. చిన్నారులకు విలువలు తెలియచేసే అవకాశం ఉండేది. ఇక, వేమన పద్యాలు, సుమతీ శతకం, బేతాళ కథలు వంటి పుస్తకాలు గొప్ప విజ్ఞానాన్ని అందించేవి. క్రమేణా చిన్నారుల్లో పుస్తకాల పట్ల అభిలాష తగ్గుతూ ఉంది. ఇందువల్ల చిన్నారుల్లో ఆత్మనూన్యత, మానసికంగా కుంగిపోవడం, అభద్రతా భావం, మానసిక వ్యధ పెరుగుతోంది. ఇటువంటి భావ దారిద్ర్యానికి మూల కారణం పుస్తక పఠనం లేకపోవడమేనని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సాహిత్యవేత్తలు అంటున్నారు. చిన్నారుల్లో పుస్తక పఠనం పట్ల అభిలాష పెంచాలని కోరుతున్నారు. తద్వారా నైతిక విలువలు, సామాజిక బాధ్యత అలవడతాయని అంటున్నారు. ఈ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచిస్తున్నారు.

పుస్తకాలు చదవడంతోనే వ్యక్తిత్వ వికాసం



మంచి పౌరులుగా పిల్లలు ఎదగాలంటే పుస్తకాలు తప్పక చదవాలి. దీనికి తోడు సంగీతం, సాహిత్యం కూడా తెలుసుకోవాలి. మంచి పుస్తకాలే గొప్ప నేస్తాలు. మంచి పుస్తకాలను పిల్లలతో చదివించే వారు గొప్ప తల్లిదండ్రులు. పిల్లలను పుస్తకాల దగ్గరకు తీసుకెళ్లే వారు ఇంకా గొప్ప తల్లిదండ్రులు, గురువులు. పిల్లలు మంచి పుస్తకాలు చదవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది.

- కోట పురుషోత్తం, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు

పుస్తక పఠనంతో సృజనాత్మకత



పుస్తకం చదివితే వ్యక్తిత్వ వికాసం పెరుగుతుంది. సృజనాత్మకత ఏర్పడుతుంది. ఇందువల్ల తొలి మొగ్గలు (కవిత్వం), పసిడి మొగ్గలు (కథలు), బాల కథా నిధి, కర దీపిక (మహనీయుల గాథలు) వంటి పుస్తకాలు తెచ్చాం. ఇలా రాబోయే తరానికి విలువలు అందించాలని ప్రయత్నిస్తున్నా. పాఠశాల స్థాయిలో పుస్తకం.. పద్యం.. కవితా పఠనంచేస్తే ఫలితాలు సాధించవచ్చు.

- డాక్టర్ నెమిలేటి కిట్టన్న, తెలుగు ఉపాధ్యాయుడు, మంగళం ట్రెండ్స్ స్కూల్

ఎర్రచందనం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

● రూ.మూడు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.మూడు లక్షలు జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ లైజన్ అధికారి చంద్రశేఖర రాజు తెలిపిన ప్రకారం.. చిత్తూరుకు చెందిన సత్యమోహన్, మరికొందరు కలిసి కొన్నేళ్లుగా శేషాచలం అడవుల్లో నుంచి ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారు. 2019లో రాయచోటి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని సరస్వతి పల్లి బీట్‌లో 39 కిలోల ఎర్రచందనం దుంగలు తమిళనాడుకు తరలించడానికి సిద్ధం చేశారు. ఈ విషయం తెలిసి అప్పటి అటవీశాఖ బీట్ అధికారి భరణికుమార్, సెక్షన్ అధికారి శ్రీరాములు అక్కడికి వెళ్లి వాహనం సహా దుంగలు పట్టుకున్నారు. నిందితుల్లో ఒకడైన సత్యమోహన్‌ను అరెస్టు చేయడానికి సిద్ధపడగా, అధికారుల ఎదుటే అతడు బ్లేడుతో ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో ఎర్రచందనం అక్రమ రవాణాతో పాటు ఆత్మహత్యాయత్నంపైనా కేసు నమోదు చేశారు. ఈ కేసును తిరుపతి ఎర్రచందనం కోర్టులో దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమ నాయుడు ప్రభుత్వం తరఫున వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా అటవీ శాఖ బీట్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, లైజన్ అధికారి చంద్రశేఖర రాజు,కోర్టు కానిస్టేబుల్ కొండయ్య తగిన సాక్ష్యాధారాలను తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితుడు సత్యమోహన్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ మూడు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నరసంహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే ఎవరినీ వదిలిపెట్టేది లేదని, శిక్షలు కఠినంగా ఉంటాయని బీట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో డ్రోన్లతోనూ నిఘా పెడతామన్నారు.




గ్రామస్థులను విచారిస్తున్న పోలీసులు, గాయపడ్డ భూపతిరెడ్డి

కత్తులతో దాడి: ఒకరికి తీవ్రగాయాలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కత్తులతో దాడి చేసిన ఘటనలో ఒకరు గాయపడిన సంఘటన రామచంద్రాపురం మండలం అనుపల్లి పంచాయతీ రేకలచేనులో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వినాయకస్వామి ఆలయం వద్ద గత శనివారం రాత్రి 11 గంటల వరకు కొందరు భజన చేశారు. గ్రామానికి చెందిన లీలాప్రకాష్‌రెడ్డి వచ్చి తన నాలుగు నెలల పాప నిద్రపోవడం లేదంటూ మైక్ ఆపాలని కోరారు. దీంతో కొంతసేపు ఆపి మళ్లీ మైక్ సౌండ్ బిగ్గరగా పెట్టి భజన చేశారు. దీంతో భజన చేసేవారితో లీలాప్రకాష్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు. మైక్ తీసుకెళ్లారు. ఈ ఘటనను భూపతిరెడ్డి వీడియో తీసి తన మిత్రుడు రాజశేఖర్‌రెడ్డికి పంపారు. లీలాప్రకాష్‌రెడ్డి హిందువులను భజన చేసుకోనీయడం లేదంటూ రాజశేఖర్‌రెడ్డి ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో వారిద్దరిపై ఆదివారం లీలాప్రకాష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● రేకలచేనులో పోలీసు పికెట్

ఈ నేపథ్యంలో భూపతిరెడ్డి సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కడుపు, గొంతుపై కత్తితో దాడి చేశారు. గాయపడిన భూపతిరెడ్డి గట్టిగా కేకలు వేయడంతో వారు వెళ్లిపోయారు. గ్రామస్థులు భూపతిరెడ్డిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ట్రైనీ ఐపీఎస్ హేమంత్, డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్ఐ రవీంద్రనాథ్ మంగళవారం ఉదయం రేకలచేను చేరుకుని గ్రామస్థులను విచారించారు. ఇదే గ్రామంలో 30 ఏళ్ల వ్యవధిలో రాజకీయ ప్రతీకార హత్యలు జరిగాయి. వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి అనే వ్యక్తులు హత్యకు గురయ్యారు. ప్రస్తుతం గాయపడిన భూపతిరెడ్డి నాగిరెడ్డి కుమారుడు. ఈ క్రమంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

తిరుమలలో తమిళనాడువాసి మృతి

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఓ యువకుడు మంగళవారం తిరుమలలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీవారి ఆలయం ముందున్న సహస్రదీపాలంకరణ మండపానికి సమీపంలో యువకుడు అచేతనంగా పడిఉంటాన్ని భక్తులు, సిబ్బంది గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వైద్య సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు ప్రకారం తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన మోహనసుందర్(35)గా తేలింది. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందినట్టు ప్రిస్క్రిప్షన్లు ఉండటంతో అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కొద్దిరోజులుగా తిరుమలలోనే ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.



మోహనసుందర్ మృతదేహం

మద్యం తాగి డ్రైవింగ్ చేసినందుకు సేవా శిక్ష

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటకు చెందిన పవన్‌కుమార్ ఆదివారం రాత్రి మద్యం తాగి, పెద్ద శబ్దాలు చేసుకుంటూ బైక్ నడుపుతుండడంతో ఎస్ఐ సుబ్బారావు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.500 జరిమానా విధించారు. అలాగే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సేవ చేయాలని తీర్పు ఇచ్చారు. ఆస్పత్రిలో సేవ చేయకుండా తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లయితే రిమాండ్ విధిస్తామని చెప్పారు. అనంతరం నిందితుడిని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

ముక్కంటి భక్తులకు మజ్జిగ పంపిణీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని క్యూలలో వేచి ఉండే భక్తులకు మజ్జిగ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 8 ఏళ్ల కిందట అప్పటి ఈవో భ్రమరాంబ భక్తుల వేసవి తాపం తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. అప్పట్లో స్వల్పసంఖ్యలో భక్తులకు మాత్రమే అమలు చేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. కొవిడ్ నుంచి మజ్జిగ పంపిణీ అటకెక్కింది. 2022 ఏప్రిల్ 17న వేసవి తాపంతో క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులు ఆర్తనాదాలు పెట్టడం అప్పట్లో దుమారం రేగింది. అప్పటి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ముక్కంటి ఆలయానికి వస్తున్నారన్న కారణంతో మండు వేసవిలో ఏప్రిల్ 17న క్యూలైన్లను కొంత సమయం స్తంభింపచేశారు. సరిగ్గా మంత్రి మహద్వారం వద్దకు చేరుకోగానే డౌన్‌డౌన్ అంటూ భక్తుల నుంచి ఆలయంలో నిరసన నినాదాలు మిన్నంటాయి. ఈ ఘటన తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆ తర్వాత వేసవిలో క్యూలైన్లలో అవసరమైన నీటి సరఫరాపై దృష్టి పెట్టారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో దేవదాయశాఖ అధికారులు ఆలయంలో భక్తులందరికి మజ్జిగ పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆలయంలో మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సతీష్‌మాలిక్, సూపరింటెండెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ అధికారులు

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాయితీపై బిందు సేద్యంపరికరాలు పొందవచ్చని జిల్లా సూక్ష్మనీటిపారుదల అధికారి సతీష్ తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90శాతం రాయితీ ఇస్తామన్నారు. 5 నుంచి 10 ఎకరాలున్న వారికి 70శాతం రాయితీ ఇస్తామన్నారు. ఐదు ఎకరాలున్న సన్నచిన్నకారు రైతులకు స్ప్రింకర్ పరికరాలపై 55శాతం, 5నుంచి పది ఎకరాలుంటే 45 శాతం రాయితీ పొందవచ్చునన్నారు. డ్రిప్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, తహసీల్దారు ధ్రువీకరించిన భూమి యాజమాన్యపత్రం లేదా 1బీ రికార్డుతో రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన వివరించారు.

వెదురుసాగుకు రాయితీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెదురు సాగు ప్రోత్సాహానికి రాయితీలు ఇస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు రంగంలో సాగు చేసేవారికి 50శాతం రాయితీ ఇస్తామన్నారు. ప్రభుత్వ రంగానికి వందశాతం సబ్సిడీ ఉంటుందన్నారు. నర్సరీ అభివృద్ధికిగాను ప్రైవేటు రంగానికి 50శాతం, ప్రభుత్వ రంగానికి వందశాతం రాయితీ ఉంటుందన్నారు. సీజనింగ్ ప్లాంట్, వెదురు డిపోలు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వ రంగంలో వందశాతం, ప్రైవేటు రంగంలో 50శాతంరాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబుల అడ్డా చెక్‌పోస్టు



భీములవారిపాళెం చెక్‌పోస్టు, లోపల ఖాళీ బీరు బాటిళ్లు (ఇన్‌సెట్లో)

తడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడుకాసుల గలగలతో కళకళలాడిన భీములవారిపాళెం చెక్‌పోస్టు నేడు మందుబాబుల అడ్డాగా మారి మద్యం బాటిళ్లతో నిండిపోయింది. 1996లో భీములవారిపాళెం వద్ద రవాణాశాఖ చెక్‌పోస్టు ఏర్పాటు అయ్యింది. 2023 ఆఖరులో రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ చెక్‌పోస్టులను మూసివేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న భీములవారి పాళెం చెక్‌పోస్టు మందుబాబులకు ఆవాసంగా మారిపోయింది. చెక్‌పోస్టు లోపల తాగి పడేసిన మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి.

హామీలను నెరవేర్చే సమర్థత సీఎం చంద్రబాబుకే ఉంది: పాశిం



పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చే సమర్థత సీఎం చంద్రబాబుకే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జనార్ధనరెడ్డి కాలనీలో లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి ప్రతినెలా ఒకటో తేదీనాడే లబ్ధిదారులకు ఇంటివద్దకే వెళ్లి అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గపరిధిలో ప్రతి నెలా రూ.16.57 కోట్ల నగదును లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, చంద్రమౌళి, మోహన్, నరసింహులనాయుడు, రమేష్, శ్రీధర్, అల్లీహుస్సేన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు: విజయశ్రీ



పూసలకాలనీలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్, కిషోర్, మాధవనాయుడు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రతి నెలా తొలిరోజునే పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే దక్కుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం ఆమె టీడీపీ నాయకులతో కలసి మన్నారుపోలూరు పూసలకాలనీలో పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు త్వరలోనే ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రహ్మణ్యం, సురేష్ నాయుడు, అలవల శ్రీనివాసులు, పామూరు మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి ఆదిశంకరలో సిల్వర్‌జూబ్లీ వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించనున్న సిల్వర్‌జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆదరణతో ఆదిశంకర కళాశాలను ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ నెల 3వ తేదీ స్థానిక కళాశాలలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక పూజలు, 4న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమురుగదాస్, వంకి అనూష, ధనుంజయ, మోహన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విభజన రాజకీయాలను సహించం

వాకాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విభజన రాజకీయాలను సహించబోమని జిల్లా ఉద్యోగ సంఘాల నాయకుడు టి.కృష్ణ అన్నారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ సమాజ చైతన్య సమితితో ఆధ్వర్యంలో మండలంలోని అశోక్‌పిల్లర్, హరిజనవాడ ప్రాంతాల్లో ఇంటింటికి అంబేడ్కర్ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో రంగనాథ్, డాక్టర్ శ్రీనివాసులు, పోలయ్య, సూర్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి మిస్టరీని ఛేదించాలి



ప్రవీణ్‌కు నివాళులర్పిస్తున్న పాస్టర్స్ సంఘం నేతలు

నాయుడుపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి మిస్టరీని పోలీసులు ఛేదించి నిజాలను నిగ్గుతేల్చాలని పాస్టర్ల సంఘ డివిజన్ అధ్యక్షుడు జోసెఫ్‌రాజు డిమాండ్ చేశారు. మంగళవారం నాయుడుపేట ఆర్యాగం నగర్‌లోని గ్రేస్ కాస్పెల్ జీసెస్ ఫౌండేషన్ చర్చి వద్ద ప్రవీణ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రవీణ్‌కుమార్, విజయకుమార్, నాగరాజు, అబ్రహం, యేసుదాసు, జేమ్స్, రాజేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు జగన్ అడ్డుపడుతున్నారు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు జగన్ అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేంద్ర విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపిందన్నారు. అయితే శాసనమండలిలో తీర్మానానికి వైసీపీ అడ్డుపడుతోందన్నారు. ఈక్రమంలో ప్రభుత్వం వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకురానుందని వివరించారు.

అన్న హత్య కేసులో తమ్ముడి అరెస్టు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అన్నను హత్య చేసిన కేసులో తమ్ముడిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. మార్చి 28వ తేదీన కాపులూరు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య మద్యం తాగి వచ్చి భార్య మణెమ్మను కొడుతుండగా తల్లి సరోజనమ్మ అడ్డొచ్చింది. దీంతో తల్లిని కూడా కొట్టడంతో వెంకటరమణయ్యను అతని తమ్ముడు బాబు నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వెంకటరమణయ్య మచ్చుకత్తితో బాబుపై దాడి చేయడానికి ప్రయత్నించగా, ఆ కత్తిని లాక్కున్న బాబు అన్న మెడపై నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం అయ్యప్పరెడ్డి పాళెం జాతీయ రహదారి సమీపంలో బాబును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటపోలూరులో మంగళవారం ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. కోట నుంచి సూళ్లూరుపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు కోటపోలూరు వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సును తప్పించబోయి రోడ్డుకు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

దేవునివెల్లంపల్లి ఈశ్వరయ్యస్వామి

తిరునాళ్లను విజయవంతం చేయాలి

సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

డక్కిలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలో ఈనెల 14వ తేదీన జరగనున్న స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్లను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా కోరారు. మంగళవారం దేవునివెల్లంపల్లిలో నిర్వహించిన స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్ల శాంతి సమావేశంలో సబ్‌కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. తిరునాళ్లలో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్‌కలెక్టరు అధికారులకు వివరించారు. భక్తులు సులభంగా స్వామివారిని దర్శించుకొనేలా ఆలయం వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, శాంతిభద్రతల విషయంలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దర్శన టికెట్ల కౌంటర్ల వద్ద ఎలాంటి తొక్కిసలాట జరగకుండా క్యూ పద్ధతి పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులకు సబ్‌కలెక్టరు సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లును భక్తులకు అంజేసే బాధ్యత దేవదాయ శాఖ అధికారులు చేపట్టాలన్నారు. తిరునాళ్ల నిర్వహణలో గ్రామస్తులు కూడా తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు తిరునాళ్ల ముగిసేవరకు పారిశుధ్య చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే ప్రత్యేక వైద్య శిబిరాలు, రెండు అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారిని కోరారు. భక్తులకు రవాణా సౌకర్యం కల్పించాల్సిన ఆర్టీసీ అధికారులు సమావేశంకు హాజరుకాకపోవడం పట్ల సబ్‌కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు సబ్‌కలెక్టర్ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య, సీఐ రమణ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శివశంకర్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉరుసు ఉత్సవాలు నిర్వహించాలి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, డీఎస్పీ చెంచుబాబు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని హజరత్ అమీర్షా వలీ దర్గా ఉరుసు ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించే బాధ్యత కమిటీ నిర్వాహకులే తీసుకోవాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. ఈనెల 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో అధ్వర్యంలో గంధోత్సవ కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో పాటు డీఎస్పీ చెంచుబాబు పాల్గొని ఉరుసు నిర్వహణపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎనిమిదేళ్ల తరువాత నిర్వహించే గంధోత్సవాన్ని ఎటువంటి వివాదాలు లేకుండా అందరూ సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో డీజే వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని సాంస్కృతిక కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పాటు ఆగిపోయిన ఉరుసు ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని అందరినీ సమన్వయం పరిచి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, నాయుడుపేట తహసీల్దార్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భకండ్రిగ భూములకు మోక్షం కల్పించండి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, వెంకన్నపాళెం సర్పంచు మధుయాదవ్

కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెం గ్రామంలో ఉన్న గర్భకండ్రిగ భూములకు మోక్షం కల్పించి ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులను మంగళవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కేంద్రమైన వెంకన్నపాళెంలో 364 ఎకరాల పట్టా భూములు 30ఏళ్లుగా గర్భకండ్రిగ జాబితాలో ఉన్నాయని తెలిపారు. దీంతో క్రయ, విక్రయాలు జరిపినా రిజిస్ట్రేషన్లు చేయించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకన్నపాళెం సర్పంచు మధుయాదవ్, రైతులు పాల్గొన్నారు.

జీవనోపాధులకు బాటలు వేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అనీలా

కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు జీవనోపాధులకు బాటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం అనీలా కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం జీవనోపాధ ులపై సీసీలు, వీవోఏలు, సంఘ బంధం అధ్యక్షురాళ్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనీలా మాట్లాడుతూ ప్రతి పొదుపు సంఘంలో ఉన్న మహిళ సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శ్రీకాంత్, ప్రసాద్, భాస్కర్, శంకరయ్య, అలివేలమ్మ, బిందు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో కోటీశ్వరరావు తనను అవమానించారని ఎంపీటీసీ శ్రీదేవి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

చదువులతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డాక్టర్ రోహిణి

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ రోహిణి అన్నారు. మంగళవారం స్థానిక ఎల్ఏపీ పాఠశాలలో యుకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధించుకునేందుకు కష్టపడి చదివే తత్వాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సుధేష్ణ, మాధవి, దయాకర్‌రెడ్డి, నంద, సురేష్ పాల్గొన్నారు.

ప్రొవిజన్ షాపులో చోరీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ప్రొవిజన్ షాపులో సోమవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. దుకాణంలో ఉన్న దాదాపు రూ.11 వేలు నగదు, బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటి రూ.30 వేల విలువైన సరుకులు చోరీచేశారు. ప్రొవిజన్ స్టోర్ యజమాని చంద్రబాబు తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈనెల 2నుంచి 22వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించి. స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 9912342070 నంబరును సంప్రదించాలన్నారు.

నేడు చిట్టమూరులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే

చిట్టమూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో ఎమ్మెల్యేకు తెలియజేయవచ్చన్నారు.

సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రూ.5.07 కోట్ల ఆస్తిపన్ను వసూలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.5.07 కోట్ల ఆస్తిపన్ను వసూలు అయినట్లు కమిషనర్ చిన్నయ్య తెలిపారు. ప్రభుత్వం ఆస్తిపన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ఇవ్వడంతో అందరూ ముందుకొచ్చి పూర్తిగా చెల్లించారని, దీంతో గత ఆర్థిక సంవత్సరాని కంటే ఈ ఏడాది రూ.73.71 లక్షలు అధికంగా పన్ను వసూలు అయినట్లు పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పాశిం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. నియోజకవర్గంలో సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. అలాగే అలాగే చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి ఏప్రిల్ 1: పెళ్లకూరులోని చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఏవో కృష్ణ తెలిపారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో కంటి పరీక్షలు చేస్తామన్నారు. అవసరమైన వారికి అరవింద్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని మెడికల్ షాపుల్లో మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని బజారుసెంటర్, ఆర్టీసీ సెంటర్, శ్యామసుందరపురం ప్రాంతాల్లో ఉన్న దుకాణాల్లో మందులు శ్యాంపిల్స్‌ను సేకరించి తీసుకువెళ్లారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు మొక్కలు నాటి దత్తత తీసుకున్నారు. మంగళవారం హెచ్‌ఎం పేర్నాటి నాగరాజు ఆధ్వర్యంలో జామ, నేరేడు, శీతాఫలం మొక్కలను నాటారు. వాటిని దత్తత తీసుకుని సంరక్షిస్తామని చెప్పారు.



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం నాగరాజు, విద్యార్థులు

ఎకరానికి రూ.1.50 కోట్ల పరిహారం ఇవ్వండి

సబ్‌కలెక్టర్‌కు రైతుల విజ్ఞప్తి

డక్కిలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం నుంచి నాయుడుపేట, శ్రీసిటీలోని పరిశ్రమలకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం పైపలైను నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. డక్కిలిలో పైపులైను నిర్మాణానికి తీసుకుంటున్న భూమికి ఇచ్చే నష్టపరిహారం తమకు సరిపోదని రైతులు అభ్యంతరం చెప్పారు. దీంతో మంగళవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా నేరుగా రైతులతో సమావేశం అయ్యారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పారు. తమ పొలాలు జాతీయ రహదారికి దగ్గరగా ఉండటంతో ఎకరం రూ.1.50 కోట్లు పలుకుతోందని, అంత మొత్తం పరిహారంగా చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఆ ధరకు ఎవరైనా భూమి కొనుగోలు చేసిఉంటే ఆ వివరాలు తెలియజేయాలని సబ్‌కలెక్టర్ కోరారు.

దాడిపై ఫిర్యాదు

తడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కారులో వెళ్తున్న తమపై దాడి చేశారంటూ ఒకరు ఫిర్యాదు చేయగా, తమను ఊరిలోకి వెళ్లకుండా వాహనాలను అడ్డుకున్నారంటూ మరోవర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాటంబేడు గ్రామానికి చెందిన ఆటంబాకం రాజేష్ తన భార్యతో కలసి సోమవారం కారులో చెన్నై వెళ్లారు. సాయంత్రం స్వగ్రామానికి వస్తూ వాటంబేడు రైల్వేగేట్ వద్ద కారు ఆపి కిందకు దిగారు. ఆ సమయంలో వాటంబేడు కుప్పం గ్రామానికి చెందిన కొందరు బైక్‌పై వెళ్తూ రైల్వేగేట్ వద్ద ఆగి రాజేష్ సతీమణితో దురుసుగా ప్రవర్తించారు. ప్రశ్నించిన రాజేష్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న రాజేష్ కుటుంబసభ్యులు వాటంబేడు సమీపంలో ట్రాక్టర్లను అడ్డుపెట్టి రాజేష్‌పై దాడి చేసిన వారిని అడ్డుకొని దాడి చేశారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



హర్షిత, నిరోషా

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి ఏప్రిల్ 1: మండలంలోని మోదుగులపాలెం గ్రామానికి చెందిన గోను హర్షిత, రోసనూరుకు చెందిన పసల నిరోషా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 4,5,6 తేదీల్లో రాజమండ్రిలో జరుగనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక పోటీలు నాయుడుపేట జడ్పీహైస్కూల్‌లో మంగళవారం జరిగాయి. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి గోను హర్షిత 55 కేజీల విభాగంలో, 8వ తరగతి విద్యార్థి పసల నిరోషా 33కేజీల విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని ఉదయ్‌కుమార్ తెలిపారు.

త్రివిక్రమ అలంకారంలో శ్రీరాముడు



త్రివిక్రమ అలంకారం, వరహా అవతారంలో శ్రీరాముడు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీరాముడు త్రివిక్రమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా బ్రాహ్మణ వీధిలోని సీతారాముల ఆలయంలో వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శ్రీరాముడు వరహా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పండ్ల రసాలు ఎక్కువగా తాగాలి

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా పండ్ల రసాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ సూచించారు. మంగళవారం సెంట్రల్ బస్సుస్టేషన్ ఆవరణంలో ప్రయాణికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటకు వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ, తలపాగా ధరించాలని సూచించారు. నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి వడదెబ్బ లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో నరసింహులు, ఏటీఎం రామచంద్రనాయుడు, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ దీప్తిలావణ్య, కిరణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు తల్లిపాల నిధి మొదటి వార్షికోత్సవం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ సహకారంతో గత ఏడాది ఏర్పాటు చేసిన తల్లిపాల నిధి కేంద్రం మొదటి వార్షికోత్సవం ఈనెల 3వ తేదీన ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు రోటరీ మిల్క్ బ్యాంక్ ప్రాజెక్టు చైర్మన్ దామోదరం తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు.

కాంట్రాక్టు కార్మికుల చర్చలు విఫలం

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల చర్చలు విఫలమయ్యాయి. సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట 9 రోజులుగా కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న ఆందోళనకు స్పందించిన సంస్థ హెచ్‌ఆర్‌డీ రమణాదేవి నాయకులను చర్చలకు ఆహ్వానించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు లేవని నాయకుడు శివప్రసాద్‌రెడ్డి హెచ్‌ఆర్‌డీ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని విన్నవించారు. ప్రధానంగా జీతాలు పెంచాలని కోరారు. అయితే అవి తమ పరిధిలో లేవని ఆమె బదులిచ్చారు. దీంతో తమ దీక్షలను యథావిధిగా కొనసాగిస్తామని నాయకులు స్పష్టంచేశారు. చర్చల్లో కుమార్, సుదర్శన్, నాగార్జునరెడ్డి, మునికృష్ణ, కిషోర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.